

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :13 సంచిక: 3 హైదరాబాద్ 2013 జూన్ పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**

# ధర్మశాల 8వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ ధర్మశాల 8వ వార్షికోత్సవం 2013 జూలై 28, ఆదివారం ఉదయం 7.30 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు (98481 11671) ఒక ప్రకటనలో తెలిపారు. మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ తదితరు బాబా ప్రేమికులు విచ్చేస్తున్నారని ఆయనన్నారు. స్థానికంగా గల బాబా ప్రేమికులందరు విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

# మౌన వార్షికోత్సవం

2013 జూలై 10 న బాబా ప్రేమికులు అందరూ మౌనం పాటిస్తారు. జూలై 9 అర్ధరాత్రి నుండి 10వ తేది అర్ధరాత్రి 12 గంటల వరకూ బాబా నామం స్మరిస్తూ మౌనం పాటిస్తారు. మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి 1969 జనవరి 31 వరకూ అంటే ఆయన భౌతిక దేహం వదిలే వరకూ కఠిన మౌనంలోనే వున్నారు. మెహెర్‌బాబా మౌనం చేపట్టిన రోజైన జూలై 10న తన ప్రేమికులందర్నీ మౌనం పాటించమని బాబా కోరారు. మౌన వార్షికోత్సవం సందర్భంగా స్థానిక బాబా సెంటర్లలో విచ్చేసే ప్రేమికుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయా సెంటర్‌ల కార్య నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి సెంటర్, జూబ్లి బాబా సెంటర్‌లలో కూడా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాబా ప్రేమికులు కానవ్పటికీ జూలై 10న మౌనం పాటించాలనుకోవడం ముదావహం.

## మెహెరాబాద్, మెహెర్‌స్థాన్

కాగా, గత కొన్ని సంవత్సరాలుగా మెహెరాబాద్‌లో, మెహెర్‌స్థాన్‌లలో బాబా సమక్షంలో మౌనం పాటించాలన్న ఉద్దేశ్యంతో చాలామంది ప్రేమికులు మెహెరాబాద్, కొవ్వూరు వెళుతున్నారు. అలా వెళ్తున్న బాబా ప్రేమికులందరికీ ఆంధ్రా గెస్టు హౌసు స్వాగతం పలుకుతోందని, కార్యదర్శి శ్రీ వై.యస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత సభ్యులు, వృద్ధులు, అనారోగ్యంతో వున్నవారికి అతిధి గృహంలో వసతి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వనున్నామని శ్రీ రావు తెలిపారు. వృద్ధుల సౌకర్యార్థం రెస్టు హౌసు నుండి బాబా సమాధి దాకా ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామని, జూలై 10 నాడు ప్రతి పది నిముషాలకు ఈ సౌకర్యం లభిస్తుందని శ్రీ రావు తెలిపారు. రెస్టు హౌసులో వసతి కోరువారు తమ విజ్ఞప్తిని త్వరలో పంపవల్సిందిగా ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## బాబా సందేశం

నేను ఎన్నడూ మౌనంగా లేను.

మీ అందరి ద్వారా మాట్లాడుతూనే వున్నాను.

I Speak Through You All

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. మౌన వార్షికోత్సవం 6-8
3. మహా దర్శనం 9-10
4. లాల్ బహదూర్ శాస్త్రి 11-13
5. వివాహంతో ఆధ్యాత్మిక ప్రగతి 14-19
6. లార్డ్ మెహెర్ 20-29
7. వానలు కురవాలని 30
7. మా మాటలు 31
9. డాక్టర్ ఘనీతో మా జ్ఞాపకాలు 32-35
10. కొత్త పుస్తకాలు 36-37
11. ప్రార్థనలు


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

## అరుదైన అవకాశం - మెహెర్‌బాబా ప్రవచనాలపై

# తెలుగులో చర్చాగోష్ఠి

## జూబ్లి సెంటర్‌లో జూలై 7 ఉదయం 9.30 నుండి సా. 5 వరకు

**"ప్రతినెలా 3వ ఆదివారం మెహెర్‌బాబా ప్రవచనములపై తెలుగులో చర్చాగోష్ఠి"** కార్యక్రమాన్ని జూబ్లి బాబా సెంటర్‌లో జూలై 7 ఆదివారం నుండి పున:ప్రారంభిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ పి. రాజేంద్ర మెహెర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బాబా ప్రేమికులందరూ తప్పక హాజరుకావలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమం ఉ.9.30 నుండి సా. 5 వరకు నిర్వహిస్తున్నట్లు మధ్యాహ్న భోజన సమయంలో వర్కింగ్ లంచ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

జూలై 7న **'సంస్కారాలు - నిర్మూలన'** అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు.

**మెహెర్‌బాబా ప్రవచనములు** (Discourses by Meher Baba),

**భగవద్వచనం** (God Speaks) ఈ రెండు గ్రంధాలలో మెహెర్‌బాబా ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను ఎంతో వివరంగా తెలియజేశారు. మెహెర్‌బాబా తన ప్రవచనాలలో దైనందిన జీవితాన్ని ఆధ్యాత్మికంగా ఎలా మలచుకోవాలో వివరంగా తెలియజేశారు. ఈ అంశాలను ఇలాంటి చర్చా వేదికలలో పాల్గొని, అనంతరం స్వయంగా చదువుకునే ప్రయత్నం చేయగల్గితే పాఠకులకు విషయం సులభంగా అర్ధమౌతుంది. అధిక సంఖ్యలో పాల్గొని గోష్ఠిని జయప్రదం చేయవల్సిందిగా శ్రీ రాజేంద్రమెహెర్ కోరారు.

# విశాఖ నూతన కార్యవర్గం

విశాఖ బాబా సెంటర్ 2013-15 నూతన కార్యవర్గం ఎంపిక చేసినట్లు
కార్యదర్శి శ్రీ యన్. వి.యస్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.
ఆ వివరాలు:- శ్రీ కె.వి. రత్నం - ప్రెసిడెంట్ - (0891-2531452/9440403429),
శ్రీ సి.హెచ్.వి. రామక్రిష్ణ, డాక్టర్ సి.హెచ్. ఉషాదేవి, - వైస్ ప్రెసిడెంట్
శ్రీ ఎన్.వి.యస్. రామారావు - సెక్రటరీ - (0891-2577703/9441293317),
శ్రీ డి. రవికుమార్ - జాయింట్ సెక్రటరీ, శ్రీ కె. హేమసుందర్ - ట్రెజరర్,
కార్యనిర్వాహక సభ్యులు శ్రీయుతులు ఆర్.యం. రాజు, ఎ.ఎల్. కాంతారావు,
కె. సత్యారావు, పి. విశ్వేశ్వరరావు, టి.డి.యస్. మూర్తి,
ఆర్. పెద్దిరాజు, సి.హెచ్. పి. సతీష్ - ఆడిటర్.

# సంపాదకీయం: బాబా ఇచ్చిన హామీ

పర్థన్ అనే ఆంగ్లేయ బాబా ప్రేమికుడు **"బాబా నీ దర్శనార్థం వచ్చేవారికి నీవిచ్చే సందేశం ఏమిటని"** అడిగితే, అందుకు బాబా సమాధానమిస్తూ ప్రతివానిలోనూ భగవంతుడున్నాడు. ప్రేమ ద్వారా మీలో వున్న భగవంతుడిని దర్శించవచ్చున్నారు. ఐతే, నిన్ను భగవంతునిగా ఆరాధించి, ప్రేమించేవారికి నీ సందేశం ఏమని ఆ పాశ్చాత్య ప్రేమికుడు తిరిగి బాబాని అడిగితే, ఆ దిశలో నేను నా ప్రేమికులకు ఇచ్చే ఆదేశాలు తు.చ.తప్పక పాటించాలని నేను కోరుకుంటానన్నారు. అలా అంటూనే, నాకు బాగా సన్నిహితులైనవారి నుండి మాత్రమే నేనామాదిరి ఆశిస్తానని, మెహెర్‌బాబా అన్నారు.

**ప్రతివానిలో వున్న భగవంతుడిని ప్రేమ ద్వారా తెలుసుకుని బ్రహ్మైక్య సాధన లక్ష్యంగా యావత్తు మానవాళిని మేల్కొల్పడమే'** మెహెర్‌బాబా ఈ అవతార కాలంలో చేపట్టిన విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమమని సంక్షిప్తంగా చెప్పుకోవాలి.

మెహెర్‌బాబా 44 సంవత్సరాలు కఠిన మౌనంలోనే తన ఆధ్యాత్మిక కార్యక్రమాల్ని నిర్వహించారు. 1925 జూలై 10 నుండి ఆయన భౌతిక దేహం వదిలే వరకూ బాబా మౌనంలోనే వున్నారు. ప్రతి ఏడాది బాబా మౌనం ప్రారంభించిన రోజైన జూలై 10న బాబా ప్రేమికులందరూ మౌనం పాటిస్తారు. ప్రప్రథమంగా, 1953 జూలై 9 అర్థరాత్రి 12 గంటల నుండి జూలై 10 అర్థరాత్రి 12 గంటల వరకూ అవకాశం గల తన ప్రేమికులందరూ మౌనంగా వుండమని మెహెర్‌బాబా స్వయంగా స్పష్టమైన సూచన చేశారు. ఆ దరిమిలా ప్రతి ఏడాది జూలై 10వ తేదీన మౌనం పాటించమని బాబా తన ప్రేమికులనందరినీ ఆదేశించారు.

మౌన వార్షికోత్సవంపై 1968లో బాబా సూచన చేస్తూ అనివార్యకారణాల వల్ల జూలై10 మౌనం పాటించలేనివారు, ఆ 24 గంటలు ఉపవాసం ఉంటామనడం ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదన్నారు.

**బాబా ప్రేమికులు గుస్తాద్‌జీ, దౌలతామాయి, బాల్ టంబాట్** – ఈ ముగ్గిరిని మాత్రం వారి తుదిశ్వాస వరకూ మౌనం పాటించమని బాబా ఆదేశించారు. ఆ ముగ్గురూ బాబా ఆదేశాలు పాటించి ధన్యులైనారు. వీరు బాబా ప్రేమికులందరికీ ఆదర్శం కావాలి. ప్రశాంతమైన మనస్సుతో, మంచి ఆలోచనలతో, భగవన్నామం స్మరిస్తూ మౌనం పాటించమన్నారు. అంతేకాదు మెరుపుతీగల్లాగా ప్రతిక్షణం మెరిసే అనేక కోరికలకు, పరిపరివిధాల పరిభ్రమించే మనస్సును మౌనంలో కట్టడి చేస్తే, **నా మాటలు మీ హృదయాలకు నేరుగా వినబడతాయని బాబా హామీ ఇచ్చారు.**

❀

## మౌన వార్షికోత్సవం

# 2013 జూలై 10



మెహెర్‌బాబా ప్రేమికులందరికీ 2013 జూలై 10 చాలా పవిత్రమైన రోజు.

జూలై 9 అర్థరాత్రి నుండీ తిరిగి జూలై 10 అర్థరాత్రి వరకూ బాబా ప్రేమికులందరూ బాబా నామం స్మరిస్తూ కఠిన మౌనం పాటిస్తారు. ఆ రోజున ప్రతి బాబా సెంటర్‌లో విచ్చేసే బాబా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. పావన గోదావరి నదీతీరాన వున్న మెహెరస్థాన్‌లో, బాబా సమాధివున్న అహ్మద్‌నగర్ జిల్లాలోని మెహెరాబాద్‌లో కూడా మౌన వార్షికోత్సవం కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏతావాతా, కొన్నివేల మంది బాబా ప్రేమికులు జూలై 10 వ తేదీనాడు కఠిన మౌనం పాటిస్తున్నారు. మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఇచ్చిన ఆదేశంగా వారు భావిస్తున్నారు. మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి తన

భౌతిక దేహం వదిలే దాకా మౌనంలోనే వున్నారు. మెహెర్‌బాబా మౌనం ప్రారంభించిన రోజు నాటికి ఆయన వయస్సు 31 సంవత్సరాలు. మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25 న పూనేలో జన్మించారు. ఆ రోజుల్లో మెహెర్‌బాబా ఎదుటివారు సమ్మోహితులయ్యేలా చమత్కారంగా మాట్లాడేవారు. స్వయంగా డోలక్ వాయిస్తూ, అద్భుతంగా ఘజల్సు గానం చేసేవారు. అనర్గళంగా ఆయన చెప్పే అనేక ఆధ్యాత్మిక విషయాలు వినడానికి ఎందరో బాబా చుట్టూతా చేరి శ్రద్ధగా ఆలకించేవారు.

ఐతే, 1925వ సంవత్సరం తొలినాళ్ళ నుండీ, బాబా తన సన్నిహితులతో తరచు తాను త్వరలో మౌనం ప్రారంభించనున్నానని అనేకమార్లు ప్రకటించారు. బాబాచేసే ఈ ప్రకటనలోని మర్మం ఆయన శిష్యులకు ఏమీ బోధపడలేదు. ఒకసారి బాబా తన మౌనం గురించి చెప్తుంటే, బాబా నీవు మౌనం పాటిస్తే, నీవు నిత్యం చెప్తున్న అనేక ధర్మ సూక్ష్మాలు మాకెవరు చెప్తారు. దయచేసి మౌనం పాటించవద్దని ఆయన శిష్యులు అనేక విధాలుగా ప్రాధేయపడ్డారు.

**అందుకు జవాబిస్తూ మెహెర్‌బాబా... నేను బోధించుటకు రాలేదు.**

**నేను మేల్కొల్పుటకు వచ్చానని ప్రకటించారు.**

**I have Come not to teach - But to Awaken -**

ఇలా మొదలయిన అవతారుని మౌనం ఆయన భౌతిక శరీరం త్యాగం చేసేదాకా కొనసాగించారు. మౌనంగానే బాబా 13సార్లు విదేశీ ప్రయాణాలు చేశారు. భగవద్వచనం, సర్వం – శూన్యం, అనేక ప్రవచనాలు గ్రంథస్థం చేశారు. బాబా తన మౌనం గురించి పలు సందర్భాలలో ప్రస్తావిస్తూ.......నేనెప్పుడూ మౌనంగా లేను. మీ హృదయాంతరాలతో నేను నిరంతరం మాట్లాడుతూనే వున్నానన్నారు.

**మెహెర్‌బాబాకు రెండుసార్లు కారు ప్రమాదాలు జరిగాయి మొదటిసారి–**అమెరికాలోని ఒక్లహోమా ప్రాంతంలో, రెండవసారి మహారాష్ట్రలోని సతారా (పూనే) దగ్గర ఘోర కారు ప్రమాదాలు జరిగాయి. ఈ భయంకర ప్రమాదంలో బాబా కాలికి, తుంటికి ఫ్రాక్చర్ అయ్యింది. బాబాకు ఆపరేషన్ చేయ్యాల్సివచ్చింది. ఆ అపరేషన్ సమయంలో కూడా బాబా తన మౌనం విడనాడ లేదు. అమితమైన బాధను మౌనంగా అనుభవించిన అవతారుడిని చూసి అటు అమెరికాలో, అలాగే మన దేశంలోని వైద్యులు అమితాశ్చర్యపడ్డారు.

సాధారణ మానవులు మౌనంగా ఇంతటి బాధను భరించలేరని డాక్టర్లు పేర్కొన్నారు. 1925 నుంచి 1954 దాకా బాబా అక్షరఫలకం సహాయంతో తన మౌనం కొనసాగించారు. ఆ తర్వాత, అక్షరఫలకం కూడా వదలి, కేవలం సంజ్ఞలతో తన సందేశాలు ఇచ్చారు. బాబా మండలి సభ్యులు, మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహితుడైన ఏరుచ్ జెస్సావాలా బాబా మౌనం గురించి ప్రస్తావిస్తూ, మండలి సభ్యులం కూడా బాబా చేపట్టిన మౌనం

ఎప్పుడు విరమిస్తారని తరచు అడుగుతుండేవారమన్నారు. అయితే, 1954లో ఒకసారి ఇలానే అడిగేసరికి, అకస్మాత్తుగా నేనిక ఈ అక్షరఫలకం కూడా వుపయోగించనన్నారు.

మేమయితే, బాబా మౌనవిరమణ చేయబోతున్నారేమో అనుకున్నాం. కాని అలా జరగలేదు. ఆనాటి నుండి బాబా అక్షరఫలకం కూడా వదలిపెట్టి తన మౌనాన్ని సంజ్ఞలతో కొనసాగించారు. ఏరుచ్ ఇంకా ఏమంటారంటే మెహెర్‌బాబా మౌనం యావత్తు మానవాళి ఆధ్యాత్మిక ఉన్నతి కోసం చేపట్టారని స్పష్టం చేశారు.

ఐతే, బాబా ఎప్పుడు మౌన విరమణ చేస్తారు.

ఈ విషయాన్ని చాలామంది మెహెర్‌బాబానే నేరుగా ప్రశ్నించారు.

1930 దశకంలో బాబా విదేశీ పర్యటనలో కూడా ఎందరో విదేశీయులు, పత్రికా విలేఖర్లు తరచు తరచి తరచి బాబా మౌన విరమణ గురించి గుచ్చి గుచ్చి ప్రశ్నించారు.

వీరందరి ప్రశ్నలకు సమాధానంగా మరో సందర్భంలో బాబా ఇలా జవాబిచ్చారని ఏరుచ్ ఇలా అన్నారు.

**కోపం వచ్చినప్పుడు ఎందుకు అలా ఎదుటి వ్యక్తిపై గట్టిగా అరుస్తారు, అని బాబా మమ్మల్ని ప్రశ్నించారు. కోపం వచ్చినప్పుడు ఎదుట వున్న వ్యక్తి హృదయంలో నుంచి దూరమవుతాడు. కోపం పెరిగేకొద్దీ, ఆ వ్యక్తుల మధ్య దూరం పెరుగుతూపోతుంది. ప్రేమ కరవౌతుంది. అందుకే ఒకరిపై మరొకరు గట్టిగా వాదులాడుకుంటారన్నారు బాబా.**

**ఆదే మరో ఇద్దరు ప్రేమికులయితే ఎలా మాట్లాడుకుంటారు. మృదువుగా, సున్నితంగా వారి సంభాషణ వుంటుంది కదా అని బాబా అన్నారు. వారిద్దరి మధ్య ప్రేమ పెరిగేకొద్దీ వారి మాటల్లో మృదుత్వం పెరుగుతుంది. ప్రేమ మరీ పెరిగితే వారి మధ్య మాటల అవసరమే తగ్గుతుంది అని బాబా వివరించారని బాబా చేపట్టిన మౌన విశిష్టతపై ఏరుచ్ క్లుప్తంగా ముగించారు.**

బాబా తన ప్రేమికులకు వారి శ్వాసకన్నా దగ్గరగా వుంటానన్నారు.
మీ హృదయాలతో నేరుగా నిరంతరం మాట్లాడుతూనే వుంటానని,
తానెప్పుడూ మౌనంగా లేనని మెహెర్‌బాబా పలు సందర్భాలలో స్పష్టం చేశారు.

# ప్రకటన

2013 జూలై 9 అర్ధరాత్రి నుండి 10వ తేదీ అర్ధరాత్రి వరకూ బాబా నామస్మరణతో మౌనం పాటించడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించండి. ఒకవేళ మధ్యలో మౌనంలో వున్నామని మరచి, మాట్లాడవల్సి వచ్చినా ఫరవా లేదు. తిరిగి మౌనం కొనసాగించండి. ఇది అవతారుడు తన ప్రేమికులందరికీ ఇచ్చిన సందేశం. బాబా ప్రేమికులందరూ బాబావారి సందేశాన్నే ఆదేశంగా స్వీకరించారు. గమనించగలరు.

# మహాదర్శనం

## (వై.సూర్యం,విశాఖ)

మెహెర్‌బాబా మౌనావతారుడు. ఆయన ప్రేమావతారుడు.

మెహెర్‌బాబా మౌనంలో వున్నా, నేడు భౌతికంగా మన మధ్యన లేకున్నా, బాబాని క్షణకాలం మనస్సులో తలుచుకుంటే ప్రతి విషయానికి ఆయన చక్కని సమాధానమిస్తాడు. ఇదిబాబా ప్రేమికులందరికీ అనుభవైక్యం. ఆ కోవకు చెందిందే శ్రీ వై. సూర్యం, విశాఖపట్నంకు చెందిన వారి అనుభూతి..అనుభవమూనూ..

శ్రీ సూర్యం ఇటీవల 2013 జనవరి 31, 44వ అమరతిథిలో జరిగిన తన అనుభవాన్ని ఇలా వివరిస్తున్నారు.

* * *

నేను, నా భార్య, మా ఇద్దరు అమ్మాయిలు ఈ ఏడాది జనవరి 31న అవతారుని
44వ అమరతిథికి మెహెరాబాద్‌కు వెళ్ళాం. జనవరి 31న బాబా దర్శనానికి
ప్రతి 500 మందికి ఒక టోకెన్ చొప్పున ఇస్తారు కదా. మాకు 18వ నెంబరు టోకెన్
వచ్చింది. ఉదయం 10.30 ప్రాంతంలో బాబా దర్శనార్థం క్యూలోకి వెళ్ళాం.
అప్పటికింకా మా ముందు టోకెన్ నెంబరు 17 నడుస్తోంది. ఆ దరిమిలా
ఉ.11 గంటలకి మేం కూడా మా వరుస క్యూలో నిల్చున్నాం.
మా ముందు సుమారు 800 మంది పైగా క్యూలో వున్నారు.
ఈ సమయంలోనే నా మదిలో ఒక ఆలోచన తళుక్కు మంది.
ఎన్నో సంవత్సరాలుగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా అమరతిథికి బాబా దర్శనార్థం
మెహెరాబాద్‌కు వస్తున్నాం. అమరతిథినాడు, జనవరి 31న
మధ్యాహ్నం 12-12.15 మధ్య మౌనం పాటిస్తారు కదా!
ఆ సమయంలో బాబా సమాధి ప్రాంగణంలోనే ఏదో ఒకచోట కూర్చుకుని
మౌనం పాటిస్తున్నాం. ఐతే ఈ దఫా మధ్యాహ్నం 12 గంటల సమయంలో క్యూలో
నిల్చునే అవకాశం వచ్చింది.
కాబట్టి మౌనం పాటించే సమయంలో సమాధికి ఎదురుగా
బాబా ఎదురుగా కూర్చునే అవకాశం లభిస్తే బాగుంటుంది కదా అని
నేను నా మటుకు నా మనస్సులో మౌనంగా అనుకున్నాను.
ఎన్నో అనుకుంటాం. అన్నీ అవుతాయా అనీ నాలో నేనే సమాధానం చెప్పుకున్నాను.
జనవరి 31వ తేదీ, అమరతిథి రోజున బాబా ఎదుట లిప్త కాలం నిలబడాలనుకోవడమే
అత్యాశవుతుంది. బాబా దర్శనానికి కూడా వరుసగా నలుగురైదుగుర్ని

ఒకేసారి దర్శనం చేసుకోవాల్సిందిగా తొందర చేస్తారు.
లేదంటే వందలాది మంది అలా క్యూల్లో నిల్చోవాల్సివస్తుందని హెచ్చరిస్తుంటారు.
అదీ నిజమే!
ఇలాంటి ఎన్నో ఆలోచనలు మనస్సులో సుడులు తిరుగుతుంటే బాబా సమాధి చెంతకు రానే వచ్చాం. సమయం మధ్యాహ్నం 12 కావస్తోంది.
వేదిక పైనుండి థాడే గారు
మరి కొద్ది నిముషాలలో చేపట్టబోయే మౌనం గురించి అనౌన్సు చేస్తున్నారు.
మా ముందు వరుసలో నిల్చున్నవారు ఒకరొకరే దర్శనం చేసుకుని బయటకు వస్తున్నారు.
ఇంతలో వాలంటీర్లు లోనికి వెళ్ళి సమాధి పై భాగాన్ని శుభ్రపరిచి బయటకొచ్చారు.
ఆ సమయంలో క్యూలో నేనూ, నా భార్య మాత్రమే సమాధి ఎదుట ఉన్నాం.
టైం చూస్తే ఉ.11.56 అయ్యింది.
వేదికపై అవతారుని నామ్‌ధున్ జోరుగా సాగుతోంది.
బాబాకేసి తదేకంగా చూస్తున్న మాకు ఒక మహిళా వాలంటీరు వచ్చి నన్నూ, నా భార్యని లోనికి వెళ్ళి బాబా దర్శనం చేసుకోమన్నారు.
నా ఆనందానికి అవధులు లేవు.
ప్రశాంతంగా మేమిద్దరం బాబాని దర్శించుకున్నాం.
ఆ సమయంలో బాబా ఎదుట మేం ఇద్దరమే ఉన్నాం. అనంతరం
సమాధి ముంగిట 15 నిముషాలు మౌనంలో కూర్చున్నాం.
**ధన్యులమైతిమిరా!** అనుకుంటూ బయటకు వస్తుంటే
**"ఈ ధపా నీ ముంగిట 15 నిముషాలు మౌనంగా కూర్చునే అవకాశం ఇప్పించవయ్యా అని నా మనస్సులో బాబాని వేడుకున్నాను.
మనస్సులో అనుకున్నదే తడవుగా అవతారుడు నా మాటలు ఆలకించాడని నా భార్య తృప్తిగా చెబుతుంటే ఆశ్చర్యపోవడం"** నా వంతైంది.
అలా బయటకు వస్తున్న మమ్ముల్ని చూసిన మా మిత్రులు శ్రీ ఐ.వి. సన్యాసిరాజు ...
సూర్యం.. మీరెంతో అదృష్టవంతులు.
నీవన్నా, నీ కుటుంబమన్నా బాబాకి చాలా
ఇష్టమయ్యా. నీకు ఎలాంటి అవకాశం ఇచ్చాడయ్యా బాబా అని
సన్యాసిరాజు నన్ను ఆలింగనం చేసుకొన్నారు.
సన్యాసిరాజు గారి మాటల్లో నిజమెంతో వుంది.
**మహాదర్శన భాగ్యం** పొందిన మేం
ధన్యులం!!

# లాల్‌బహదూర్ శాస్త్రి



ఇండియా - పాకిస్థాన్ నడుమ యుద్ధం 1965 అక్టోబరులో అర్ధాంతరంగా ముగిసింది.

ఆ తర్వాత కొన్నాళ్ళకు (జనవరి 1966)ఆనాటి సోవియట్

యూనియన్ - రష్యా, ప్రధాని చొరవ తీసుకుని భారత్ - పాకిస్థాన్ ప్రధానమంత్రుల సమావేశాన్ని

జనవరి 3, 1966న రష్యాలోని తాష్కెంట్‌లో ఏర్పాటుచేశాడు.

ఆనాటి భారత ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి 1966 జనవరి 3న

తాష్కెంట్‌కు బయల్దేరి వెళ్తున్నారు. ఇదంతా చరిత్ర.

ఐతే శాస్త్రీజీ తాష్కెంట్‌కు బయల్దేరి వెళ్ళేందుకు ముందురోజు రాత్రి మెహెర్‌బాబా

భావూజీతో మాట్లాడుతూ తాష్కెంట్ వెళ్తున్న శాస్త్రి గారు తాష్కెంట్ నుండి తిరిగి క్షేమంగా వస్తారా? అని అడిగారు.

అదేమిటి బాబా? అలా అడుగుతున్నావని భావూజీ అనగానే,

రష్యాలో చలి చాలా ఎక్కువగా వుంది. శాస్త్రి గారి ఆరోగ్యం అంత బాగాలేదు కదా! హార్ట్ పేషంట్ కూడా కదా? అన్నారు బాబా.

బహుశా! శాస్త్రి క్షేమంగా తిరిగి భారత్‌కి రాడేమోననిపిస్తోందని బాబా
భావుతో తిరిగి అన్నారు.
శాస్త్రి గారు చాలా మంచి వ్యక్తి. మృదు భాషి.
సున్నిత మనస్కుడని భావూ అన్నారు.
ఒకవేళ శాస్త్రి గారికి ఏమైనా జరగరానిది జరిగితే ప్రధాని కాగల వాళ్ళు ఎవరున్నారని
భావూ అనగానే, ఒక మంచి శక్తివంతమైన క్రొత్త ప్రధాని వస్తారని బాబా అన్నారు.
ఆ తర్వాత కొన్ని క్షణాలు ఆగి బాబా తన సంభాషణ కొనసాగిస్తూ, నెహ్రూ గారి
కుమార్తె ప్రధాని పదవి చేపడితే ఎలాగుంటుందనుకుంటున్నావ్? అని బాబా భావుని
ప్రశ్నించారు.
ఆమె ప్రధానిగా ఏం పనికొస్తుంది బాబా!
ఆమెకంత అనుభవం ఎక్కడుందని బాబా అని భావూ అన్నారు.
ఓ అలాగా! ఆమె సంగతి నీకు తెలియదులే!
జవహర్‌లాల్ ఆమెకన్నీ నేర్పాడు.
ఆమె చాలా తెలివైంది అని బాబా అన్నారు.
బాబాకు తనకు మధ్య జరిగిన సంభాషణను బాబా ప్రేమికుడు నారిమన్‌తో భావూ
ఓ సందర్భంలో ప్రస్తావించాడు.
ఆ దరిమిలా తాష్కెంట్ వెళ్ళిన లాల్ బహదూర్ శాస్త్రి మరణించడం,
ప్రధానిగా ఇందిరా గాంధీ పదవీ బాధ్యతలు చేపట్టడం చకచకా జరిగాయి.
నారిమన్ – భావూలు – ఈ విషయం గుర్తుచేసుకుని ఆనాడు ఆశ్చర్యపడటం
వారివంతైంది.
ఇదిలావుంటే శాస్త్రీజి తాష్కెంట్‌కు వెళ్ళేముందర ఓ రోజున బాబా ప్రేమికుడు,
ప్రొఫెసర్ సి.డి. దేశ్‌ముఖ్, ఢిల్లీ వెళ్ళి ప్రధాని లాల్ బహదూర్‌ని కలిసి,
అవతార్ మెహెర్‌బాబా గురించి ఆయనకు తెలియజేసి, బాబా ప్రార్ధనలు, సాహిత్యం
గల చిన్న పుస్తకాలను ఆయన చేతికి అందించాడు.
తన తీరిక సమయంలో బాబా ప్రార్ధనలు తప్పక చేసుకుంటానని లాల్‌బహదూర్
దేశ్‌ముఖ్‌కు హామీ ఇచ్చాడు. అంతేకాదు బాబా సాహిత్యం చేతుల్లో
వుంచుకుని శాస్త్రీజి – సిడి దేశ్‌ముఖ్‌తో ఫోటో కూడా తీయించుకున్నాడు.ఆ ఫోటోని
ప్రక్క పేజీలలో మీరూ పరిశీలించండి!
1966 జనవరి 11, మంగళవారం లాల్‌బహదూర్ శాస్త్రి మరణించారని తెలిసిన
బాబా – శ్రీ శాస్త్రి గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరణించడానికి
కొద్దిరోజుల మునుపు డాక్టర్ సి.డి. దేశ్‌ముఖ్ ద్వారా నా గురించి తెలుసుకోవడం
అతను చేసుకున్న అదృష్టం అని బాబా అన్నారు.

"Man is born for his last day"
**మనిషి జన్మించిందే మరణించడానికని – ఓ కవీశ్వరుడు అన్నాడు.**
**ఐతే నేనేమంటానంటే అంటూ బాబా ఇలా అన్నారు.**
**ఎవరూ మరణించరు. ఎవరికీ మరణం గురించి తెలియదు. ఎవరికైతే మరణం గురించి అవగాహన వుందో వారు చాలా అరుదు. అంతేకాదు అలాంటివారికి మళ్ళీ జన్మంటూ వుండదని మెహెర్‌బాబా అన్నారు.**

# ఎర్రని చిరునామాలు

**2011 నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను పూర్తిగా తొలగించడమైంది. కాగా 2012 జనవరి, ఆ తదుపరి మాసాల నుండి వార్షిక సభ్యత్వం చెల్లించని వారి చిరునామాలను ఈ సంచిక కవరుపై ఎర్రని రంగులో హెచ్చరికగా పంపుతున్నాం. దయచేసి గమనించి బాబా ప్రేమికులు తక్షణమే వారి వార్షిక సభ్యత్వం చెల్లించి సహకరించగలరు. లేనిఎడల ఆయా సభ్యులకు పత్రికలు పంపడం నిలిపివేయవలెనని నిర్ణయించడమైంది. దయచేసి గమనించగలరు. అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు కూడా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి.**

## హెల్ప్‌లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతి నెలా 25వ తేదీ లోగా మీకు అందడంలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492–42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.**

# జోగిపేట బాబా కేంద్రం 20వ వార్షికోత్సవం

19.05.2013న జోగిపేట కేంద్రం 20వ వార్షికోత్సవం జరిగింది. ఉదయం బాబా చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ రామచందర్, రామాయంపేట సెంటర్ సహవాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ ప్రసాదరాజు, శ్రీ నారాయణరావు జోషి, శ్రీ వెంకటేశ్వరరావు, శ్రీ పియస్‌కె శర్మ, శ్రీ జ్ఞానేశ్వర్, శ్రీ చంద్రప్ప, శ్రీ ప్రకాష్ తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. శ్రీ శ్రీనివాస్ – సత్యాన్వేషణ – ఏకపాత్రాభినయం చేశారు. అనంతరం ప్రార్థనలు ఆరతితో కార్యక్రమం ముగిసింది.

## మెహెర్‌బాబా ప్రవచనం

# వివాహంతో ఆధ్యాత్మిక ప్రగతి

**(యం. శారద,సికింద్రాబాద్)**



ప్రతి ఒక్కని జీవితంలో వివాహం చాలా ప్రధానమైంది.

వివాహం ఆధ్యాత్మిక ఉన్నతికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఐతే, ఈ విషయం చాలా మందికి తెలియక యధాలాపంగా పెళ్ళి చేసుకుని కాలం వెళ్ళదీస్తుంటారు. అలాగే పెళ్ళి గురించి, దాంపత్య జీవన విశిష్టత గురించి సరైన అవగాహన లేకుండానే చాలా మంది వివాహం చేసుకోవడానికి సిద్ధమౌతారు. వివాహం ఆధ్యాత్మిక ఉన్నతికి తప్పక ఉపయోగపడుతుంది.

ఇది అందరి విషయంలో మాత్రం కాదు.

**వివాహం జరిగిన నూతన వధూవరులు ఇద్దరూ సత్యనిష్ఠతో, ఉన్నత ప్రమాణాలతో జీవనం గడిపినప్పుడు, వారికి తప్పకుండా ఆధ్యాత్మిక ప్రగతి లభిస్తుందని, అలాకాని వారికి వివాహం ఒక గొప్ప ప్రతిబంధకంగా మారినా ఆశ్చర్యపడవలిసిన పనిలేదని క్రొత్తగా పెళ్ళిచేసుకున్న నూతన వధూవరులను ఉద్దేశించి ఇచ్చిన ప్రవచనంలో మెహెర్‌బాబా స్పష్టం చేశారు.**

పాణిగ్రహణానికి ఉన్న ప్రాముఖ్యతను మెహెర్‌బాబా తన సందేశంలో ఈ తరం వారందరికీ తెలియజేసేలా చాలా వివరంగా చెప్పారు.

వివాహం అంటే తమకి ఇష్టమున్నవారితోనో, లేదా పెద్దవాళ్ళకిష్టమైన వారితోనో జరిపే రెండు గంటల తంతుకాదని తెలుసుకోవాలన్నారు మెహెర్‌బాబా.

పెళ్ళి అయిన తర్వాత భార్యా భర్త లిద్దరూ తమ వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించి జీవనం కొనసాగించడం సుతారామూ వృధా అన్నారు.

శారీరక అవసరాల కోసం, వ్యాపారంలో మాదిరి లాభ నష్టాలను తరచి తరచి అంచనాలు వేసుకుంటూ జరిపే వివాహాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని

మెహెర్‌బాబా స్పష్టం చేశారు.
వైవాహిక జీవితంలో పరస్పర సర్దుబాటు అవసరం.
ఒకరి నొకరు అర్థం చేసుకునేలా చక్కని అవగాహన ఎంతో ముఖ్యం.
ఇలా ఎందుకంటే, పెళ్ళి అయ్యాక ఊహించని అనేక కష్టాలు,సమస్యలు
ఏవైనా వారికి ఎదురుకావచ్చు.
జీవితంలో ఎవరికైనా కష్టాలు రావడం సహజం.
కానీ పెళ్ళి అయ్యాక ఎదురయ్యే కష్టాలు ప్రత్యేకం అనొచ్చు.
వైవాహిక జీవితంలో రెండు ఆత్మలు అనేక సంబంధ బాంధవ్యాల్ని కలిగి ఉంటాయి.
కాబట్టి, వారికి భిన్న వ్యక్తిత్వాల వల్ల అనేక సమస్యలు ఎదురౌతాయి.
అలాంటివాటిని పరిష్కరించుకునే శక్తియుక్తులు వారు కలిగి ఉండాలి.
వివాహేతర సంబంధం అవాంఛనీయం.
వివాహేతర సంబంధం కేవలం శారీరక అవసరాలను తీరుస్తుంది కానీ,
ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలనుకున్న సాధకులను తప్పుదోవ పట్టిస్తుంది.
ఒక మనిషి వ్యక్తిత్వం భిన్న కోణాలతో ఉంటుంది.
అవంత సులువుగా అర్థం కావు.
ఐతే, వైవాహిక జీవితంలో ఇదెంతో సులభం.
మనస్సులో అవ్యక్తంగా, నిగూఢంగా, బయటకు చెప్పలేకుండా ఉన్న
అనేక భావాలు వైవాహిక జీవితంలో సులభంగా బహిర్గతమవుతాయి.
అనేక ఉన్నతమైన, లేదా అల్పమైన భావాలుంటాయి.
వీటి మధ్య జరిగే సంఘర్షణ ద్వారా, తమ చాకచక్యంతో
ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునే అవకాశం ఆ దంపతులకు కలుగుతుంది.
ఒక వ్యక్తికి మరొక అమ్మాయితో పెళ్ళి అయ్యాక,
అంతా ఆనందమయంగా ఉంటుందనడానికి వీల్లేదు.
ఈ భూమ్మీద పుట్టిన ప్రతి మానవుడు ఎదుర్కొనే సమస్యలన్నింటినీ దాదాపుగా
పెళ్ళియ్యాక ప్రతి ఒక్కరూ ఎదుర్కోవల్సివుంటుంది.
ఈ సమస్యలతో సతమతమవుతూ క్రొత్త సమస్యలను సృష్టించుకుని
ఆ బంధనాలలో చిక్కుకునే అవకాశమూ వుంది.
అలాగే బంధనాల నుండి బయటపడి స్వేఛ్ఛా స్వాతంత్ర్యాలతో మానసిక వికాసంతో
ఆధ్యాత్మిక పథంలో ముందుకు సాగే అవకాశం వుంది.
సాధారణంగా ఒకరికి మరొకరితో వివాహం జరిపే ముందు,
ప్రతివారూ కూడా ఎదుటివారిలో బయటకు కనిపించేటువంటివి, కంటికి కనిపించని
మంచీ – చెడు లక్షణాలను, వాటితోపాటు ఆర్థిక, మరి ఇతర ప్రయోజనాలెన్నింటినో

బేరీజు వేసుకుని పెళ్ళిళ్ళు జరుపుతారు.
ఇది సర్వసాధారణం.
మన సమాజంలో సాధారణంగా ఈ పద్ధతిలోనే ఎక్కువమందికి
పెళ్ళిళ్ళు జరుగుతుండటం మనం చూస్తుంటాం.
ఐతే, ఈ పెళ్ళిళ్ళలో కూడా ఆ రెండు ఆత్మల నడుమ తీవ్ర వ్యతిరేకత-సంఘర్షణ ఉంటుంది. ఈ సంఘర్షణ, వ్యతిరేకత కూడా ఆయా దంపతుల నడుమ చాలా అవసరం. ఈ సంఘర్షణ ద్వారా వారిలోగల నిమ్న ఆలోచనా ధోరణి నుండి బయటపడి, యధార్థమైన దైవీస్థితికి వారు ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.
వివాహంలో రెండు ఆత్మలు అనేక సంబంధ బాంధవ్యాలుతో ముడిపడి వుంటాయి.
ఈ సంబంధాల వల్ల అనేక సమస్యలూ ఎదురౌతాయి.
ఆ సమస్యలను సర్దుబాటు ధోరణిలో పరిష్కరించుకోవాలి.
అంతేకానీ, సమస్యలతో భయభ్రాంతులై భార్యా భర్తలు ఇద్దరూ తమ బంధాన్ని త్రెంచుకుని విడిపోరాదు.
**తలాఖ్ తలాఖ్ అంటే** దంపతుల జీవితాలు అస్తవ్యస్తమౌతాయి.
ఆంతరికంగా ఇద్దరూ సహనంతో సర్ధుకుపోవడం అలవరచుకోవాలి.
అందుకే వివాహం అనేది చాలా కష్టమైనది, జటిలమైనదీనని
మెహెర్‌బాబా తన ప్రవచనంలో పేర్కొన్నారు.
**సమస్యలను సావధానంగా, అవగాహనతో అర్థం చేసుకుని సర్ధుకుపోవడానికి కల్పించిన ఒక చక్కని అవకాశమే వివాహం అని బాబా శెలవిచ్చారు.**

## దైవీ ప్రణాళిక

వైవాహిక జీవితంలో గొప్ప ఆధ్యాత్మిక శక్తి దాగివుంది.
ఈ శక్తి ఆయా దంపతులు నిత్య జీవితంలో అనేక ముఖ్యాంశాలను నిర్దేశిస్తాయి.
ముఖ్యంగా చిన్న చిన్న కోర్కెలు, ప్రయోజనాలను ఆశిస్తూ ప్రాపంచిక దృష్టితో జీవనం గడిపితే స్వార్థపూరిత దృష్టి అలవడుతుంది.
అదే నిత్య జీవనంలో ఉన్నత ఆదర్శాలతో, ఆశయాలతో గడిపితే,
వారిరువురి ఆత్మలు పరస్పరం ఒకరిపట్ల మరొకరికి ప్రేమ,
త్యాగం, సామరస్యపూర్వకంగా సహ జీవనం గడపడం దినదినాభివృద్ధి చెందుతుంది.
తద్వారా వారి **ప్రేమ, సేవ** ద్వారా వీరిరువురు యావత్తు మానవాళి సుఖసంతోషాలకు కారణమవుతారు.
దైవీ ప్రణాళికకు అనుగుణంగా వీరి జీవనం గడిపితే,
వీరికి జన్మించే సంతానం ఎంతో అదృష్టవంతులౌతారు.

ఈ ప్రపంచంలోకి అడుగుపెడుతూనే వీరి సంతానానికి ఒక చక్కని
ఆధ్యాత్మిక వాతావరణం లభిస్తుంది. ఇదొక మాదిరిగా
వైవాహిక జీవనంలో అడుగిడిన దంపతులకిది ఒక గొప్ప వరం.
ఈ మాదిరిగా తల్లితండ్రుల వల్ల సంతానానికి ప్రయోజనం కలిగితే,
ఆ సంతానం వల్ల తలితండ్రుల వైవాహిక జీవితం సుసంపన్నమౌతుంది.
అదెలాగంటే, తల్లితండ్రులు తమ పిల్లల పట్ల నిజమైన ప్రేమ చూపిస్తారు.
ఎలాంటి స్వార్థం, ఎలాంటి ప్రతిఫలాపేక్ష ఆశించని ఈ నిజమైన ప్రేమ
ద్వారా త్యాగానికి అత్యంత విలువనిస్తారు. ఈ ప్రేమ-త్యాగం ఆధ్యాత్మిక ఉన్నతికి
ప్రధాన సోపానాలు. తల్లితండ్రులు తమ పిల్లలను నిస్వార్థమైన ప్రేమతో
పెంచడం ద్వారా ఆ ప్రేమ-త్యాగాన్ని క్రమేణా అలవరచుకుని,
తమ ఆధ్యాత్మిక ప్రగతిలో ముందుకు పయనిస్తారు.
వైవాహిక జీవనంలో పిల్లలకు జన్మ ఇచ్చేందుకు తల్లితండ్రులు
సంతోషంగా స్వాగతించాలని మెహెర్‌బాబా సూచించారు.
అదే సమయంలో దంపతులు సంతాన నియంత్రణ అంశాన్ని చాలా జాగ్రత్తగా
పరిశీలించాలి. సామాజిక సంక్షేమం అదే సమయంలో ఆధ్యాత్మిక దృక్పధాలకు
ప్రాధాన్యత ఇవ్వాలి. సంతాన నియంత్రణ గురించి చాలామందికి సరైన అవగాహన
లేదు. ఈ విషయంలో ఒకింత అయోమయం, గందగోళ స్థితి ఉంది.
**నానాటికీ పెరుగుతున్న జనాభా సమస్యకు సంతాన నియంత్రణ అత్యవసరం.**
ఐనప్పటికీ సంతాన నియంత్రణ కోసం వినియోగించే భౌతిక పద్ధతులు ఎంతమాత్రం
ఆమోదయోగ్యం కాదని మెహెర్‌బాబా అన్నారు.
సంతాన నియంత్రణ లేకపోతే సమాజంలో అశాంతి ప్రజ్వరిల్లుతుంది.
అసాంఘిక కార్యకలాపాలు పెచ్చరిల్లుతాయి.
అధిక సంతానం వల్ల తల్లితండ్రులకు తలకిమించిన భారమౌతుంది.
వీటన్నింటికీ తోడు సమాజంలో పేదరికం పెరిగి, నేరాలకు యుద్ధాలకు కారణమౌతుంది.
ఏతావాతా..సంతాన నియంత్రణ సరైనదే.
కానీ దానికోసం భౌతిక సాధనాల వినియోగం ఆమోదం కాదు.
ఎందుకంటే సామాన్య ప్రజానీకం ఈ సాధనాలను తమ స్వార్ధ ప్రయోజనాల కోసం
వాడుకుని, పిల్లలను కనిపెంచడమనే బాధ్యతల నుండి తప్పించుకోవటానికి
ప్రయత్నిస్తారు. కోర్కెలు తీర్చుకుని ఆపై సంభవించే పరిణామాల నుండి
తప్పించుకునేందుకు ఈ సాధనాలు ఉపకరిస్తాయి.
ఇందువలన ఉన్నత విలువల పాటించాలనే అంశం మరుగున పడిపోతుంది.
మనస్సును నియంత్రించడంపై ఆసక్తి కనుమరుగవుతుంది.

విశృంఖలతకు అలవాటుపడి, మనో నిగ్రహాన్ని గాలికొదిలేసి, కామానికి బానిసలౌతారు.
భౌతిక, నైతిక, ఆధ్యాత్మిక వినాశనాన్ని కొని తెచ్చుకుంటారు.
ఈ సంతాన నిరోధక సాధనాల వల్ల ఆధ్యాత్మికత మరుగునపడే అవకాశం వుంది.
ఆధ్యాత్మిక సాధకులైనా, సామాన్య మానవులైనా,
సంతాన నియంత్రణ కోసం భౌతికసాధనాల వినియోగం ఆమోదయోగ్యం కాదు.
సంతానం వద్దనుకుంటే మనో నిగ్రహాన్ని పాటించాలి.
**మనో నిగ్రహం ప్రధానం.**
మనోనిగ్రహం ద్వారా సంతాన నియంత్రణ ఒక్కటే కాదు,
మానవాళి తమ దివ్యస్థితిని కూడా తెలుసుకోగల్గుతారు.
మనోనిగ్రహం ద్వారా మనుష్యులలో పశుప్రవృత్తి తగ్గుతుంది.
మానసిక ఒత్తిడులు తగ్గుతాయి. ప్రశాంతత అలవడుతుంది.
భౌతిక సాధనాల వాడకం వలన ఆధ్యాత్మిక విపత్తు కలుగుతుంది.
సంతాన నిరోధానికి,
మానవాళి తమ దివ్యస్థితిని తెలుసుకొనడానికి,
**మనో నిగ్రహం** ఎంతైనా అవసరం.
కేవలం మనో నిగ్రహం ద్వారా మాత్రమే మనిషి పశువాంఛ నుండి ప్రశాంతత,
బంధనాల నుండి స్వేచ్ఛ లభిస్తుంది.
ఆలోచనాపరులందరూ ఈ విషయంపై కూలంకషంగా ఆలోచించాలి.
పిల్లలకి జన్మనివ్వడమేకాకుండా చిన్నతనంలో వారిని లాలించి ప్రేమగా పెంచే
బాధ్యత తల్లితండ్రులిద్దరిలో తల్లిపైనే ఎక్కువ ఉంటుంది.
అలాగే పిల్లలు పెరిగి పెద్దయ్యాక వారికి విద్యాబుద్ధులు,
వారిని ప్రయోజకులను చేసే బాధ్యత తండ్రిపైనే ఉంటుంది.
ఆ మాదిరిగా పిల్లల ఆలనాపాలనా భార్యాభర్తలిద్దరూ
సమంగా చేపట్టినప్పుడు, మనోనిగ్రహం పాటించే విషయంలో ఇరువురి
నడుమ చక్కని అవగాహన లభిస్తుంది.
ఒకవేళ మనోనిగ్రహ సాధనలో వైఫల్యం చెందినట్లైతే, పిల్లలను ఇష్టంగాను,
ఆనందంగా ఆహ్వానించే బాధ్యత భార్యాభర్తలిద్దరూ సమిష్టి చేపట్టాలి.

## పిల్లల్ని ఆహ్వానించాలి

ఒకవేళ పిల్లల బాధ్యత చేపట్టడానికి సిద్ధంగా లేకపోతే,
అలాంటి భార్యాభర్తలకు ఒక్కటే మార్గం.
**అలాంటి వారు తప్పక బ్రహ్మచర్యం పాటించాలి.**
మనోనిగ్రహం అలవరచుకోవాలి.

ఇదేమీ చెప్పినంత సులువు కాదు.
అలాగే అసాధ్యం కూడా కాదు.
ఆధ్యాత్మిక మార్గంలో బ్రహ్మచర్యం ఉత్తమం.
కఠిన బ్రహ్మచర్యం పాటించలేనివారు విశృంఖల శృంగారానికి బానిసలు కాకుండా పెళ్ళి చేసుకోవడమే ఉత్తమం.
వైవాహిక జీవితంలోనే కామవాంఛను క్రమేణా నిగ్రహించుకునే ప్రయత్నం చేయ్యాలి.
అలా చేయలేనివారు కృత్రిమ విధానాలకు లోనుకాకుండా ప్రకృతి పరిణామాలను స్వాగతిస్తూ పిల్లలను కనిపెంచే బాధ్యతను చేపట్టడానికి సిద్ధపడాలి.
**ఆధ్యాత్మిక దృష్టితో చూసినట్లయితే సంతాన నియంత్రణను మనోనిగ్రహంతోనే సాధించాలి. ఇందుకు మరో మార్గమంటూ లేదు.**
మనోనిగ్రహాన్ని క్రమేణా సాధించాలనే ప్రయత్నం కొనసాగిస్తూనే మేం తాత్కాలికంగా భౌతిక పద్ధతులు అవలంభిస్తామనడం కూడా కుదరదని మెహెర్‌బాబా హెచ్చరించారు.
ఎందుకంటే తాత్కాలికమని చెప్పితే అది అంతటితో ఆగదు.
తాత్కాలికం అనంతంగా కొనసాగే అవకాశం ఉందని బాబా అన్నారు.
అంతేకాదు, ఈ తాత్కాలిక భౌతిక పద్ధతుల వినియోగానికి కట్టుబానిసలై తమ విధానమే అసలు సిసలైనదని సమర్ధించుకునేందుకూ అవకాశం లేకపోలేదని బాబా అన్నారు .
భౌతిక పద్ధతుల వినియోగాన్ని సమర్ధించుకుంటూ మానసిక నిగ్రహ సాధన అసాధ్యం.
కాబట్టి ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నత విలువలుతో కూడిన జీవిక కోరుకునేవారందరూ తమ ఇష్టాఇష్టాలను ప్రక్కన పెట్టాల్సిందేనని, మెహెర్‌బాబా హితవు చెప్పారు.
పెళ్ళయిన తొలినాళ్ళలో భార్యాభర్తల మధ్య ప్రధానంగా ఆకర్షణ ఉండొచ్చు.
ఐతే, క్రమేణా వారిద్దరి మధ్య ప్రేమ, అనురాగం, అవగాహన, ఒకరిపై మరొకరికి అనురక్తి ప్రగాఢంగా పెరుగుతుంది.
జీవితంలో అనేక సుఖదు:ఖాలను కలిసి అనుభవిస్తూ, ఆధ్యాత్మిక విజయ పథంలో ముందుకు సాగుతారు. మొదట్లో అనేక కోరికలతో, సందేహాలతో ఉండే వారి ప్రేమ స్థానంలో **త్యాగపూరిత ప్రేమ జనిస్తుంది.**
ఈ విధంగా విజ్ఞతతో వైవాహిక జీవితము గడిపినవారు ఆధ్యాత్మిక పధంలో మునుముందుకు సాగిపోవడమే కాదు,
**ఒక సద్గురు స్పర్శతో వారి జీవితంలో అనిర్వచనీయమైన అనంత శాశ్వత ఆనంద ప్రాప్తి లభిస్తుంది.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: – భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**
**వాల్యూం-4 (1929 మే నుండి) – తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

***(గత సంచిక తరువాయి)***

అప్పట్లో నీలు డాక్టరు చదువు చదువుతున్నాడు ముంబాయిలో.
సద్బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఇతగాడి బాల్యం పూనాలో గడిచింది.
అక్కడి న్యూ ఇంగ్లీషు హైస్కూల్‌లో చదువుతున్న రోజుల్లో విష్ణుతో పరిచయమయింది.
ఇద్దరూ ప్రాణ స్నేహితులయ్యారు. కాలేజీ చదువుకి నీలు బొంబాయి వెళ్ళినా
ఇద్దరి మధ్య స్నేహం తెగలేదు సరికదా మరింత బలపడింది.
గ్రాంట్ మెడికల్ కాలేజీలో సీటు రావటం అంటే మాట కాదు.
సరస్వతీ కటాక్షం వున్న అదృష్టవంతులకే అందులో సీటు దొరికేది.
నీలు అదృష్టమనండి, తెలివితేటల వల్ల అనండి గ్రాంట్‌లో సీటు వచ్చింది.
నీలు కంటే ఎక్కువ పొంగిపోయాడు విష్ణు.
మరి నీ సంగతి ఏమిటిరా అంటే,
నవ్వేశాడు జవాబుగా.
పెద్ద చదువులు చదవాలనీ, దొర గారిలా వెలగిపోవాలనీ కుర్రకారు కలలు కనేరోజులవి.
కలలది ఊహా ప్రపంచం. ఆ మాయా జగత్తు నాకెందుకు.
మాయా మత్తు పోగొట్టే వైద్యుడి దగ్గరకే వెడతాను నేను అంటూ విష్ణు మెహెర్‌బాబా
వారి దగ్గరకు చేరాడు. మందులిచ్చే డాక్టర్లున్నారు కానీ
మాయామత్తు పోగొట్టే డాక్టర్లున్న వైనం లేదుగా అని మిత్రుడు ఎంత చెప్పినా
విష్ణు పట్టించుకోలేదు.
సరికదా ఓ రోజుకి నువ్వు నా దారికే వస్తావు, చూస్తూ వుండు అన్నాడు.
అదేమీ ఓ సవాలుగానూ, అనలేదు, ఏదో వుబుసుపోకనే అనలేదు.
నేను నమ్మిన దైవం నీకూ ఆరాధ్య దైవం అవుతాడో రోజుకి.
ఆ శుభ ఘడియ కోసం చూస్తుంటాను వేయి కళ్ళతో అంటున్నాడనిపించింది నీలూకి.
ఆ! ఇదంతా ఓ మెట్ట వేదాంతం, నాలుగు రోజులు పోతే వాడే నా దారిన వస్తాడు.
నేను వాడి దారికి వెళ్ళటమేమిటి అనిపించింది.
అలా విష్ణు మెహెరాబాద్ దారి పడితే, నీలూ బొంబాయి దారి పట్టాడు.

అప్పుడప్పుడు కలుస్తున్నారు పూనాలో.
ఉత్తరాలు వ్రాసుకొంటున్నారు.
విష్ణు ఉత్తరాలలో ఎప్పుడూ మెహెర్‌బాబా వారి గురించే వ్రాసేవాడు.
"ఏమిటో, ఈ ఇరానీవాడి గొడవ నా కెందుకు వ్రాస్తున్నాడో, వద్దంటే బాధపడతాడు అనిపించింది నీలూకి.
అందుకనే, ఇష్టం లేకపోయినా విష్ణు ఉత్తరం సాంతం చదివేవాడు.
చదివి పుస్తకాల ప్రక్కనే పెట్టేవాడు. ఉత్తరంలో ఆఖరి వాఖ్యం నవ్వుతెప్పించేది.
"నువ్వు మెహెరాబాద్‌కి రావోయి ఒక్కసారి.
మా బాబావారిని దర్శించుకో అని వుండేది.
నేనేమిటి, ఆ పల్లెటూరికి వెళ్ళటమేమిటి,
ఆ మూగాయనని దర్శించడమేమిటి అని నవ్వుకొనేవాడు నీలు.
రోజులు దొర్లుతున్నాయి.
నీలూ చదువు బాగానే సాగుతోంది. మార్కులు బాగా వస్తున్నాయి.
అందరిలో గుర్తింపు వస్తోంది.
ఈ ఆనందాన్ని చిన్ననాటి స్నేహితుడితో పంచుకోవాలనుకొన్నాడు.
వెంటనే మెహెరాబాద్‌లో వాలాడు.
అది 1952వ సంవత్సరం.
హాయిగా మనస్సువిప్పి మాట్లాడుకోవాలి.
సరదాగా పాతరోజులు గుర్తుచేసుకోవాలి అనుకొంటూ వచ్చిన నీలుకి,
వెంటనే విష్ణు కనబడలేదు.
కానీ మెహెర్‌బాబా ఎదురయ్యారు.
నాకేమీ ఈ మహానుభావుడి దర్శనం అక్కర్లేదు.
నేనీయన కోసం వస్తే కదా ఇక్కడకి అని అతను అనుకోవడం,
నీ మనస్సులో మాట నాకు తెలీయదటోయి అన్నట్లు బాబావారు మాట్లాడటం ఒక్కసారే జరిగాయి.
"ఇలా వెడితే నీ స్నేహితుడు కనిపిస్తాడు.
అటువెళ్ళి హాయిగా కబుర్లు చెప్పుకోండి.
మీకిష్టం వచ్చినంతసేపు మాట్లాడుకోండి" అని బాబావారు అంటుంటే,
"అరే! ఈ మెహెర్‌బాబాకి నా మనస్సు తెలుసు అన్న మాట.
ఇంకేమి, నేనూ ఈయన దగ్గరకే చేరితే పోదూ అనుకొన్నాడు.
అప్పటి వరకు ఈ బాబా గొడవ నాకెందుకు అనుకొనే నీలూకు
బాబావారిపై గురికుదిరింది. బాబావారి పంచన చేరాలనుకున్నాడు.

ఆ మాటే బాబావారితో అంటే ఆయన సంతోషించారు.
బాగా చదువుకో, చదువయ్యాక నా దగ్గరకి వద్దువుగాని అన్నారు.
ఖాళీ దొరికినప్పుడల్లా తమని గుర్తుచేసుకోమన్నారు.
నేను ఏదో అదీ ఇదీ అనుకోకు.
నన్ను నీ స్నేహితుడిగా స్వీకరించు అన్నారు.
నీ అన్నయ్య ననుకో.
తమ్ముడంటే అన్నకి ప్రేమ వుంటుంది కదా.
మరి నీవన్నా నాకు ఎంతో ఇష్టం అని బాబావారు అంటుంటే నీలు పొంగిపోయాడు.
తరుచు వస్తుంటాను బాబా అన్నాడు.
శలవులు ఇచ్చారంటే మెహెరాబాద్ దారి పడ్తానన్నాడు. తప్పకుండా రా.
నా ఆశీస్సులు నీకెప్పుడూ వుంటాయి అని బాబావారు అభయం పలికారు.
అలా అప్పటి నుంచి నీలు తరుచు మెహెరాబాద్‌కి వస్తున్నాడు బాబాని దర్శిస్తున్నాడు.
చిన్నప్పటి నేస్తాన్ని కలుస్తున్నాడు. మండలివారికి దగ్గరయ్యాడు. అందరివాడయ్యాడు.
ఇలా నాలుగేళ్ళు గడిచాయి. 1929 జూన్ నెల రానే వచ్చింది.
ఇలా ఎన్నిసార్లు రావటం, వెళ్ళటం ఇహ ఇక్కడే వుంటే బాగుణ్ణు అనిపించింది
మన డాక్టరు గారికి.
"ఆ ఘడియా వస్తోంది, కాస్తంత ఓపిక పట్టు" అన్నారు బాబావారు.
మండలివారు నా ఆరోగ్యం గురించి బాధపడతారు తప్ప ఏం చేయలేరు వాళ్ళు.
డాక్టర్లు కాదు కదా. ఓ డాక్టరుంటే ఇంకేమి కావాలి.
ఓ పెద్ద ఆస్పత్రిని తెరవాలని వుంది.
నాకూ మందు మాకు దొరుకుతాయి.
చుట్టుప్రక్కల గ్రామస్థులకీ వైద్యం దొరుకుతుంది అని బాబావారు అన్నారు.
బాబావారి సంగతి పాఠకులకి తెలుసుగా.
ఎప్పుడూ మండలివారిని పరాయివాళ్ళ ముందు తక్కువచేసి మాట్లాడుతుంటారు.
మోహం చిన్నబుచ్చుకునేవాళ్ళు చిన్నబుచ్చుకొంటారు.
పరంధాముడికే సేవకులం, మేము అధికులం అన్న అహంకారం రాకుండా
కాపాడుతున్నారు బాబావారు అనుకొనేవారు అనుకొనేవారు.
ఎవరి సంస్కారాల పరిధిని బట్టి వాళ్ళు స్పందన వుండేది.
సరే ఇంతకీ ఈ జూన్ 19వ తేదీన కూడా బాబావారు మండలివారిని వదల్లేదు.
వీళ్ళంతా శుద్ధదండగ మనుషులు అన్నారు.
బాబా ఆంతర్యం కానీ, బాబా మాటల తీరు కానీ అంతగా తెలియని మన బొంబాయి
డాక్టరు గారికి "ఇదేమిటీ! బాబావారు ఇలా అంటున్నారు

పాపం! మండలివారు ఏం తప్పుచేశారో" అనిపించింది తప్ప
బాబావారు అందర్నీ ఆటపట్టిస్తున్నారన్న భావన కలగలేదు.
అతని ఆలోచనలకి బాబావారి మాటలు అంతరాయం కల్గించాయి.
వీళ్లున్నారే, అదే మండలివారు శుద్ధదండగ మనుషులు.
వాళ్ళకి నలత చేస్తే, నేనే మందులివ్వాలి.
నా దగ్గర అన్ని రకాల జబ్బులకీ మందులున్నాయనుకో.
నేను డాక్టర్లకే డాక్టరని కదా.
నేను ఇచ్చే మందు, నీవంటి డార్టర్లు ఇచ్చే మందు కాదు కదా!
నా మందు మాయ పొగ తొలగిస్తుంది.
రోగికి ఉపశమనం కల్గించే మందులు ఇస్తారు మీరయితే.
నాకు అటువంటి డాక్టరు కావాలి.
నాకంటే నాకే కాదు, మెహెరాబాద్‌కి కూడా కావాలి అని అన్నారు.
ఈమాట కోసమే ఎదురు చూస్తున్న నీలు ఎగిరి గంతేసినంత పనిచేశాడు.
"బాబా! నేను వచ్చేస్తా, ఇక్కడే వుంటా అందరికీ వైద్యం చేస్తాను" అన్నాడు.
వస్తానంటే వద్దంటానా అన్నారు బాబా.
నీలు ఆనందానికి పట్టపగ్గాలు లేవు.
ఎప్పుడు రావాలి, ఏఏ మందులు తెచ్చుకోవాలి అన్న ఆలోచనలో నీలు పడితే,
అతగాడిని నీరు కారుస్తూ బాబావారు, ఇప్పుడే రావద్దులే అన్నారు.
నీ చదువు పూర్తికాలేదు కదా.
చదువు అయిపోగానే వద్దువుగాని, అప్పటి వరకు ఇక్కడికి రావాలన్న
ఆలోచన పెట్టుకోకు అన్నారు.
నీ చిన్న నాటి నేస్తం విష్ణు మాటల్ని పట్టించుకోకు.
రారమ్మని వేధిస్తాడు, వేధిస్తే వేధించనీ.
అతగాడి ఉత్తరాల్ని లెక్కచేయకు. చదువు ముఖ్యం.
బాగా చదువుకో. డాక్టరు పట్టా తీసుకొన్నాక నాదగ్గరకి వద్దువుగాని
అని బాబావారు నీలూకి హితవు చెప్పారు.
వద్దన్న పనే చేయాలనిపిస్తుంది పిల్లలకి.
అందరి పిల్లల వంటివాడే కదా మన నీలు కూడా బాబావారు ఇప్పుడే వద్దంటుంటే,
ఎంత త్వరగా చదువు అయిపోతుందా, ఎంత త్వరగా మెహెరాబాద్‌లో
వాలుతానా అన్న పట్టుదల పెరిగింది.
ఆ కోర్కె తీరే రోజు కోసం కళ్ళు కాయలు చేసుకొని ఎదురు చూశాడు.
ఆరేళ్ళకి ఆ సుమధుర ఘడియ వచ్చింది.

వెంటనే బాబావారి సన్నిధిలో వాలాడు.
మండలిలో ఒక్కటయ్యాడు.
ప్రేమాశ్రపు గోపికలు ఆఘూ ఆలీ, ఆలీ అక్బరులపై బాబావారొక ఆంక్ష విధించారు.
ఆ సంగతి పాఠకులకి గుర్తుండి వుండాలి.
గుర్తు లేకపోతే మరోసారి గుర్తుచేసుకొందాము.
వీరిద్దరూ మండలివారితో మాట్లాడకూడదని బాబావారు స్పష్టం చేశారు.
ఎందుకు వేశారో ఈ ఆంక్ష తెలియదు కానీ,
బాబావారి ఆజ్ఞ మేరకి నడుచుకోవటం వారి విధి.
ఏమయిందో వాళ్ళకి కానీ, బాబా ఆజ్ఞ మరిచిపోయి మండలివారితో
మాట్లాడుతూ సిద్ధా కళ్ళ పడ్డారు.
వెంటనే అతగాడు బాబావారికి చెప్పాడా సంగతి.
ఆఘూ, అక్బరులకి కబురు వెళ్ళింది.
బాబావారి సమక్షంలో వెంటనే హాజరు అయ్యారు.
ఇది జూన్ రెండవ తేదీ నాటి సంఘటన.
ఎప్పుడూ వినయంతో, విధేయతతో వుండే ఈ చిన్నారి గోపికల తప్పుని
క్షమించారు. కాస్తంత మందలించారు. తమమాట ప్రకారం నడుచుకోవాలి.
అవిధేయత పనికిరాదని చెప్పారు.
ఎందుకు వినాలి మీమాట అంటూ అక్బరు తోక తొక్కిన త్రాచులా లేచాడు.
నోరు పారేసుకొన్నాడు. ఆ దృశ్యం చూస్తున్నవాళ్ళకి మతి పోయింది.
ఆలీ అక్బరు ఏమిటి?
బాబా మాటకి ఎదురు తిరగడమేమిటి? అని ఆశ్చర్యపడ్డారు.
బాబావారి పైనే గొంతు ఎత్తి గట్టిగా మాట్లాడేటంత వాడయ్యాడా?
పిదపకాలం, పిదప బుద్ధులు అనుకొన్నారు ఇంకొందరు.
వీడి భరతం బాబావారు పడతారీవాళ అనుకొన్నారు చాలామంది.
బాబావారు ఒకేఒక్క మాట అన్నారు.
ఇష్టం లేకపోతే వెళ్ళిపో అన్నారు. ఇక్కడ వుండనక్కర్లేదు.
బలవంతం ఏమీ లేదన్నారు.
బాబావారి మాటలు కటువుగా వినిపించాయి వినేవాళ్ళకి.
కానీ ఆలీ అక్బరు ఖంగుతినలేదు సరికదా,
నే పోతున్నా అన్నాడు. అరిచినట్లు వుంది వాడిమాట.
బాబావారూ అంత ఘాటుగానే బదులిచ్చారు.
పోవాలనివుంటే ఫో అన్నారు.

నువ్వేమయితే మాకేమిటి అన్నారు.
ఎప్పుడు బయలుదేరుతున్నావో చెప్పు అని అడిగారు.
బాబావారి మాటలు కొరడా ఝుళిపించినట్లున్నాయి.
అంతే ఆలీ అక్బరు నీరు కారిపోయాడు.
గొంతు మూగపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.
వాడి కళ్ళలో నీళ్ళు చూస్తూనే బాబావారు కరిగిపోయారు.
దగ్గరకి తీసుకొని లాలించారు. ఆఘూ ఆలీని కూడా దగ్గరకి తీసుకొని ముద్దాడారు.
ఇద్దరికీ ధైర్యం చెప్పారు. మీరు ఎంతో అదృష్టవంతులు.
అందుకనే నా దగ్గర వుండగల్గుతున్నారు ఇక్కడ.
మీకు తెలియదు మీరు ఎంత జాతకులో.
అల్లా కోసం నామాట వినండి.
నా మాట వింటేనే మీరు నన్ను ప్రేమించగల్గుతారు అని బాబావారు విధేయత పాఠాన్ని మరోసారి చెప్పారు.
మీరు చెప్పినట్లే వుంటామని ఆలీ అక్బరు, ఆఘూ ఆలీ తల వూపారు.
వాళ్ళిద్దరికీ పట్టిన పూనకం వదిలింది.
ఎవరికి ఏమందు వేయాలో ఎంత మోతాదులో వేయాలో తెలిసిన డాక్టరు మెహెరుడు
అందుకనే తిట్టలేదు, కొట్టలేదు, బెదిరించలేదు.
రెండు మాటలు వీళ్ళని దారిలోకి తెచ్చాయి.
వాళ్ళు మనలో పడ్డాక, ఎప్పటిలా లాలించారు.
ముద్దాడారు. అక్కున చేర్చుకొన్నారు.

## రామాజీ పెళ్ళి

రామాజీ అన్న ఆరంగావ్ కుర్రాడు. ఆశ్రమం స్కూల్లో చదువుతున్నాడు.
వాడంటే బాబావారికి చాలా ఇష్టం.
ఫలానా అందుకు ఇష్టమని బాబావారు ఎప్పుడూ చెప్పలేదు.
ఆశ్రమం స్కూల్లో వాడు చాలాకాలంగా చదువుకొంటున్నాడు.
బహుశా ఆ అనుబంధం వల్ల కూడా వాడంటే బాబావారికి ఇష్టం ఏర్పడి వుండవచ్చు.
ఇవన్నీ మన ఊహలు. అసలు కారణం మనకి తెలీదు.
కారణమేమయితేనేం, బాబావారు వాడికో హితవు, నీ కోసమే చెప్తున్నానంటూ చెప్పారు.
బాల్య వివాహాలు సర్వ సాధారణం అప్పట్లో.
నువ్వు చిన్నాడివి. పెళ్ళి చేసుకోకు అని బాబావారు వాడిని హెచ్చరించారు.
రామాజీ సరేనని బుర్ర వూపాడు కాని,

ఇంటి దగ్గర వాడి పప్పులు వుడకవుకదా.
తండ్రి ఓ సంబంధం ఖాయం చేశాడు.
పెళ్ళికి ముహూర్తం జూన్ ఐదవ తేదీ అన్నాడు.
ముహూర్తానికి పెళ్ళివారు అట్టహాసంగా కదిలారు.
బ్రహ్మాండంగా రంగురంగుల తోరణాలతో అలంకరించిన ఎడ్లబండి ఎక్కారు.
మగ పెళ్ళివారి ఊరేగింపు బయలుదేరింది.
పెళ్ళి ఆరంగావ్‌లోనే.
పెళ్ళి మండపం దగ్గర పడుతుంటే ఓ ఎద్దు కుప్పకూలిపోయింది.
ఆ బండిలో వాళ్ళు క్రింద పడ్డారు.
ఏమయింది అని ఆదుర్దా పడుతుంటే ఎద్దు కాస్తా చచ్చిపోయింది.
ఏమిటీ అపశకునం అనుకొంటూంటే కుంభవృష్టి మొదలయింది.
సరే ఏం చేస్తాం, ఈ వేళ్టికి పెళ్ళి కష్టం అనుకొంటూ
తాళికట్టు శుభవేళని వాయిదా వేశారు.
అతిథులు ఇళ్ళ దారి పట్టారు. అంత వర్షంలోనూ ఎడతెరిపి లేకుండా
వర్షం కురుస్తోందేమో, ఊరి పొలిమేరల్లోని వాగు పొంగింది.
వాగు దాటబోయిన ఓ నలుగురు వరదలో చిక్కుకు పోయారు.
వాళ్ళని రక్షించేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది.
ఆరంగావ్‌లో రామాజీ గోడు బాబావారికి తెలియకపోతే కదా.
అయ్యో పాపం పసివాడు అనుకొన్నారో ఏమో,
ఆ కుర్రాడిని తీసుకురా అని భావూ ఛీమాకి చెప్పారు.
తాళి కట్టేలోగా బాబావారి దగ్గరకి ఒక్కసారైనా వచ్చి కనబడమంటున్నారని
చెప్పమన్నారు. బాబావారి దర్శనం చేసుకోకపోతే అష్టకష్టాలు
తప్పవని హెచ్చరించమన్నారు.
ఛీమా చెప్పినట్టే చేశాడు. అంత వర్షంలోనూ వెళ్ళి రామాజీని కలిశాడు.
బాబావారు చెప్పిన ప్రకారం చేయి, లేకపోతే నష్టపోతావు నువ్వు అన్నాడు.
ఎందుకు వెళ్ళను రేపు ప్రొద్దుటే వెళ్ళి ప్రభువుని దర్శిస్తానన్నాడా కుర్రాడు.
అన్నట్టు ఉదయాన్నే మెహెరాబాద్‌కి వచ్చాడు.
బాబావారిని చూస్తూనే బోరుమన్నాడు.
'క్షమించు బాబా! తప్పయిపోయింది' అన్నాడు.
విఠలుడి మనస్సు వెన్న. భక్తుడి దీనావస్థ చూసి కరిగిపోయాడు.
బాధపడకు, నిన్నేమీ అననులే, క్షమించేశాను నీ తప్పుని అన్నారు.
పెళ్ళి చేసుకోవద్దన్నాను.

కానీ నామాట పెడచెవిని పెట్టారు.
ఇందువల్ల ఎంత నష్టపోయావో నీకు తెలీదు.
ఆ ఎద్దు కనుక కుప్పకూలి చచ్చిపోకపోతే, పెళ్ళికూతురు చచ్చిపోవాల్సింది.
నీక్కాబోయే భార్యని కాపాడటానికి నేనెంత కష్టపడ్డానో ఊహించు,
చేసిన తప్పు ఒప్పుకున్నావు, పశ్చాత్తాపడ్డావు సరే, కానీ అన్నారు.
పెళ్ళికూతురు చావుని తప్పించిన జగన్నాధుడికి ఎద్దు గురించి తెలీదా,
తెలుసు! కానీ ఏమీ తెలియనట్లు చాలా అమాయకంగా అడిగారు.
రామా! ఇంతకీ ఎద్దుకి ఏమయింది? ఎలా చచ్చిపోయింది.
అది రోగిష్టిదా ఏమిటి? అని ప్రశ్నించారు.
రామాజీ ఏమో బాబా! ఏమయిందో తెలీదు.
బండికి కట్టే సరికి ఎద్దు బాగానేవుంది.
బాగుందనే దాన్ని బండికి కట్టింది.
ఏమయిందో మరి ఒక్కసారిగా క్రిందపడింది.
పడ్డూనే చచ్చిపోయింది.
బాబా, ఓహో! అలాగా! అయినా నీకు తెలీదులే ఎప్పటికీ ఎద్దు చావుకి కారణం.
నువ్వు మాత్రం నామాట జవదాటకు.
మర్చిపోకు కలలో కూడా ఈ సంగతి రామాజీ.
ఎప్పుడూ మరచిపోను బాబా!
కలలో కూడా మీ మాట దాటను.
మళ్ళీ ఎప్పుడూ ఇలా తప్పు చేయను.
రామాజీ మాట్లాడుతుంటే సగం మాటలు బయటకి రాలేదు.
దు:ఖం ఆపుకోలేకపోయాడు.
బాబావారి పాదాలపై పడ్డాడు.
ఈ కుర్రాడు అశ్రుధారలతో బాబావారికి పాదాభిషేకం చేశాడు.
బాబావారు వాడిని దగ్గరకి తీసుకొని లాలించారు.
ఏడవకు, నీకేంకాదు,
నామాట ప్రకారం నడుచుకో చాలు అన్నారు.
రామాజీకి పెళ్ళి అయిన రెండు రోజులకి,
అంటే జూన్ ఏడవ తేదీన మెహెరాబాద్‌లో, ఆరంగావ్‌లో మళ్ళీ పండగ కళ వచ్చింది.
ఎందుకూ అంటే, ఆ వేళ సద్గురు ఉపాసనీ మహారాజ్ గారి జన్మదినం కాబట్టి.
అవతారునికే గురువు అయిన మహారాజ్ షష్ఠి పూర్తికి దగ్గరపడుతున్నారు.
యాభయి ఎనిమిది నిండాయి. యాభయి తొమ్మిదిలో అడుగుపెట్టారు.

మహారాజ్ పుట్టినరోజుని ఘనంగా జరిపారు.
ఉదయాన్నే బాబా వారికి అభ్యంగన స్నానం చేయించారు.
ఆరంగావ్‌కి పల్లకిలో ఊరేగిస్తూ తీసుకువెళ్ళారు.
ఒక్క పల్లకీ అయితే ఏం బాగుంటుందనుకొన్నారో ఏమో,
పల్లకికి గుర్రపు బండికి కట్టి, ఆ బండిని తామే లాగారు మండలివారు.
ప్రపంచ భారాన్ని తమ భుజాలపై వేసుకొన్న పరంధాముడి బరువుని
మండలివారు మోశారన్నమాట.
ఎంత అదృష్టమో కదూ అది!
ఏజన్మలో చేసుకొన్న పుణ్యమో, వాళ్ళ తల్లి తండ్రులు నేర్పిన సంస్కారాల
ఫలమో ఏమో, ఏది ఏమయితేనేం, అవతార్ మెహెర్‌బాబా వారిని
ఊరేగించగలిగారు. ఆ అద్భుత దృశ్యాన్ని చూసి తరించారు ఆరంగావ్ వాసులు.
బాబాకి ఆరంగావ్ కొత్త కాదు. ఆరంగావ్ వాసులకీ బాబావారు కొత్త కాదు.
కానీ ఆనాటి అనుభవం మాత్రం కొత్తదే.
దరిమిలా ఎన్నోసార్లు బాబావారిని పల్లకిలో ఊరేగిస్తూ తీసుకువెళ్ళారు.
గుర్రపు బండిలో బాబావారిని కూర్చోపెట్టి, పిల్లలు పెద్దలు లాగారు.
తోపుడు రిక్షాలో కూర్చోపెట్టి మెహెరాబాద్ కొండ నుంచి
బాబావారిని క్రిందకు తెచ్చిన సందర్భాలు ఉన్నాయి.
కానీ కానీ గుర్రపు బండికి పల్లకీని జోడించి,
అందులో బాబావారిని కూర్చోపెట్టి ఊరేగించిన సందర్భం ఇదొక్కటే.
అందుకనే అదృష్టవంతులని వీరిని అభినందిస్తున్నది.
సరే, ఎప్పటిలాగా, ఆ వేళ కూడా గ్రామస్థులకీ,
మండలివారికీ విందు భోజనం దొరికింది.
చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఎందరో వచ్చారు
బాబావారి దర్శనానికి. అలా వచ్చిన వారందరూ బాబా నామ సంకీర్తన చేశారు.
పాటలు పాడారు. భజన చేశారు.
ఉపాసనీ పుట్టినరోజు పండగపై తెర పడేసరికి అర్ధరాత్రి దాటింది.

## స్త్రీమండలి కథ

ఇహ మళ్ళీ స్త్రీ మండలి కథలోకి వెళ్తే...
స్త్రీ మండలి నాసిక్‌లో వుంటున్న సంగతి పాఠకులకి తెలుసు.
ఉత్తరదేశ యాత్రకి బాబావారు వెళ్ళేముందు, స్త్రీమండలి నాసిక్‌కి మారారు.
వాళ్ళని కలిసి, మంచీ చెడు కనుక్కొని, ఆశీస్సులు చెప్పి, బాబావారు ఉత్తరదేశ యాత్రకి

రైలు ఎక్కారనీ పాఠకులకి తెలుసు.
వెళ్ళే ముందు తమని కలిసి వెళ్ళారు కాబట్టి, వాపసు వస్తూనే తమని చూడటానికి వస్తారని స్త్రీ మండలి అనుకొంది తప్పేముంది అందులో.
అయితే వాళ్ళ ఆశ నిరాశ అయింది.
బాబావారు క్వెట్టా నుంచి ఏకాయెకీ మెహెరాబాద్‌కి వచ్చేశారు.
క్వెట్టా నుంచి రైల్లో బొంబాయి వచ్చాక, అక్కడి నుంచి నాసిక్ వెళ్ళి వుండవచ్చు. బొంబాయికి నాసిక్ దగ్గరే కదా.
నాసిక్ నుంచి మెహెరాబాద్ దగ్గరే కదా.
కానీ, బాబావారు అలా చేయలేదు.
ఏకాయెకీ మెహెరాబాద్‌కి వచ్చేశారు.
ఎందుకో తెలుసా? ప్రేమాశ్రమం గోపిక కోసం!
బాబావారు ఊరికి బయలుదేరే ముందు పిల్లలు అందర్నీ ఇళ్ళకి వెళ్ళమని చెప్పినా, నలుగురు వుండిపోయారు.
వాళ్ళ కోసం బాబావారు స్త్రీమండలిని కూడా పట్టించుకోలేదు.
ఈ నలుగురూ ఎవరో ఊహించండి?
ఆఘూ ఆలీ, ఆలీ అక్బరు, వసంత్, షాపూర్ – వీళ్ళు ఆ నలుగురూ.
క్వెట్టా నుంచి వచ్చాక, బాబావారు వాళ్ళని తమకి దూరంగానే వుంచారు.
ఈ నాలుగు గోపికలు అందరి వంటివి కావుకదా.
అందుకని వాటి కోసమే ఓ ఆశ్రమం పెడితే ఏలా వుంటుంది?
పాఠక మహాశయులకి వచ్చిన ఆలోచనే మండలివారికీ వచ్చింది.
సర్వాంతర్యామికీ వచ్చింది. అంతే జూన్ ఎనిమిదిన కొత్త ఆశ్రమం వెలసింది.
పుట్టిరోజు జరుపుకున్న మర్నాడే ఈ ప్రత్యేక ప్రేమాశ్రమాన్నీ తెరవడంలో కూడా ఏదో ఆధ్యాత్మిక విశిష్టత ఇమిడి వుండాలి.
బాబావారు ఏపనీ వుబుసుపోక చేయరుకదా.
శ్రీవారి ప్రతి మాట, ప్రతి చేత లోక కళ్యాణం కోసమే.
ప్రేమాశ్రమం పనులు గతంలో రావ్ సాహెబ్ చూసేవాడు కొత్త ఆశ్రమం పనులు అతనికి అప్పగిస్తారనుకొన్నారందరూ.
కానీ ఇది రావ్ సాహెబ్‌కి సుతరామూ ఇష్టం లేదు.
ఈ పిల్లలతో వేగలేకపోతున్నాను బాబూ!
మీకేం తెలుసు వీళ్ళ ఆకతాయి తనం.
నా సహనాన్ని పరీక్షిస్తున్నారు క్షణం క్షణం అన్నాడు.

**సశేషం**

# వానలు కురవాలని

మెహెరాబాద్, మెహెరాజాద్ ఆ పరిసరాలలో వానలు కురవాలని, కుంటలు నిండాలని కొంతమంది యువత (2013 మే 26 నుండి జూన్ 2 వరకు) ఏడు రోజులపాటు రోజుకు సుమారు 20 గంటలపాటు బాబా నామస్మరణ నిరంతరాయంగా తెల్లవారుఝామున 5 గంటల నుండి అర్ధరాత్రి ఒంటిగంట వరకు నిర్వహించినట్లు కె. శాండిల్య, విజయవాడ ఒక ప్రకటనలో తెలిపారు.




2001 నుండి వరుసగా ప్రతి ఏడాది మెహెరాబాద్‌లో నిర్వహిస్తున్న యువజన సమ్మేళనంలో పాల్గొన్న దేశ విదేశాల్లో వున్న యువత అధికశాతం ఈ మహాక్రతువులో పాల్గొన్నారని ఆయన అన్నారు.

## ఐతే వానలు పడ్డాయా?

మే 25 నుండి ఒకవారం రోజులపాటు **మెహెరాబాద్‌లోని** డి. హాస్టలులో బస చేసిన ప్రొఫెసర్ కె. కేశవరావు జూన్ 1, 2 తేదీలలో మంచి వర్షాలు కురిసాయని స్థానికంగా గల అనేక కుంటలు, చెరువులు నీళ్ళతో కళకళలాడాయని తెలియజేశారు.

యువత చేసిన ప్రార్థనలను అవతారుడు ఆలకించాడని డాక్టర్ కేశవరావు అన్నారు.

*

# మల్కాజిగిరి సెంటర్

ఈ ఏడాది తీవ్ర ఎండాకాలం – మార్చి 24 నుండి జూన్ 1 వరకు స్థానిక మెహెర్‌బాబా మల్కాజిగిరి సెంటర్ ఆధ్వర్యంలో **చల్లని మంచినీళ్ళు** అందజేసి ఎందరో దాహార్తులకు సహాయం చేశారు. ప్రతిరోజు ఉదయం 10 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహించిన ఈ చలివేంద్రాన్ని జూన్ 2 నుండి నైరుతీ రుతుపవనాల రాకతో భాగ్యనగరం చల్లబడ్డాక విజయవంతంగా ఉద్వాసన పలికారు. ప్రతి శనివారం మంచినీటితోపాటు **చల్లని మజ్జిగ** కూడా ప్రేమగా అందజేసి ఎందరికో సహాయపడ్డారు. అత్యధిక జనసమర్ధత గల మల్కాజిగిరి ప్రాంతంలో తీవ్ర ఎండాకాలంలో మంచినీళ్ళు, చల్లని మజ్జిగ పొందిన స్థానికులు వాటిని అమృతతుల్యంగా భావించారు. ఈ ఏర్పాట్లలో అనేక మధురానుభూతులు తాము చవిచూశామని బాబా ప్రేమికులు, బాబా సెంటర్ కార్యదర్శి, అధ్యక్షులు శ్రీ పి.పి. హరి, శ్రీ కె. జగన్నాధరావు తెలిపారు. ఇందుకు శ్రీ వి.ఆర్.కె. శాస్త్రి తదితరులు తమ అమూల్య సేవలు అందజేశారని శ్రీ హరి అన్నారు. వీరి సేవలు పలువురికి ఆదర్శంకావాలని స్థానికులు పేర్కొన్నారు.

# నాగభూషణం బాబాలో ఐక్యం



విశాఖపట్నం శ్రీ పంతులు గారి అబ్బాయిగా బాబా ప్రేమికులందరికీ పరిచయస్థుడైన శ్రీ ఎన్. నాగభూషణరావు, గరివిడి, విజయనగరం జిల్లా 2013 మే, 26న బాబాలో ఐక్యమయ్యారు. ఈ విషయాన్ని వారి సోదరుడు తెలియజేస్తూ శ్రీ నాగభుషణరావు తన చిన్నతనం నుండీ బాబా సేవలో తరించిన ధన్యజీవి అన్నారు. విజయనగరంలోని చీపురుపల్లిలో బాబా సెంటర్ స్థాపనలో ఆయన చాలా చురుకుగా పాల్గొన్నాడని అన్నారు. తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస వదిలిన నాగభూషణరావు జ్ఞాపకార్థం జూన్ 6న విశాఖపట్నంలోని స్వగృహంలో బాబా సహవాస్ నిర్వహించామని, అనేక మంది బాబా ప్రేమికులు హాజరయ్యారని వారి సోదరుడు శ్రీ ఎన్.వి.యస్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# విశాఖ బాబా సెంటర్ 42వ వార్షికోత్సవం

విశాఖపట్నం బాబా సెంటర్ 42వ వార్షికోత్సవం 2013 జూన్, 2 ఆదివారం ఘనంగా జరుపుకున్నామని కార్యదర్శి శ్రీ ఎన్.వి.యస్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.
ముఖ్య అతిధిగా ఎడిటర్, బిలవడ్ బాబా పత్రిక శ్రీ మలకపల్లి మల్లిఖార్జునరావు పాల్గొని బాబా సందేశాలపై ప్రసంగించారు. డాక్టర్ సి.హెచ్. ఉషాదేవి, శ్రీ కె.వి. రత్నం తదితరులు బాబా సందేశాలను ఆచరణలో అమలు చేయడానికి బాబా ప్రేమికులు ప్రయత్నించాలన్నారు. ముందుగా, శ్రీ ఆర్. రాజబాబు – డిప్యూటి మేనేజర్, హెచ్.ఎస్.ఎల్ గాంధీగ్రాం అవతారుని సప్తవర్ణపతాకాన్ని ఆవిష్కరించారు.

# డాక్టర్ ఘనీతో మా జ్ఞాపకాలు

-ప్రతాప్ ఆహిర్, పూణే.



## అవతారుని ఆశ్రమంలో వేలం పాట

మెహెర్‌బాబా బెంగళూరులో ఆశ్రమం నిర్వహించే సమయంలో జరిగిన సంఘటన ఇది.

ఆ రోజుల్లో మెహెర్ ఆశ్రమానికి డాక్టర్ ఘనీ అధిపతిగా ఉన్నాడు. ఐతే ఓ సందర్భంలో జమా ఖర్చుల్లో కొద్దిపాటి తేడా వచ్చింది. అకౌంట్స్‌లో కొంత లోటు వచ్చింది. ఆ లోటును భర్తీచేయడానికై ఘనీ తాను బహుమతిగా సంపాదించుకున్న సూటును అమ్మి, ఆ వచ్చిన నగదును లోటు బడ్జెట్‌కు లెఖ్ఖ చూపి, తను ఎలాగో బయటపడాలని డా. ఘనీ ఆలోచన చేశాడు. పాఠకులకు గుర్తుండే వుంటుంది. గత సంచికలో డా. ఘనీ రాసిన **'అవతార్'** అనే వ్యాసానికి మెహెర్‌బాబా ఉత్తమ రచనగా ప్రశంశిస్తూ, ఒక సూట్‌ను డా. ఘనీకి బహుకరించారు.

డా. ఘనీ ఆ సూట్‌నే అమ్మివేసి, వచ్చిన సొమ్ముని ఆశ్రమ నిర్వహణ ఖాతాకు జమచేయ్యాలని నిర్ణయించుకున్నాడు.

సూట్‌ను అమ్మడానికి వీలుగా ఆశ్రమంలో వేలం ఏర్పాటుచేశాడు.

మెహెరాశ్రమంలో వేలం పాటలా?

ఇది ఆశ్రమ నియమాలను ఉల్లంఘించినట్లు కాదా?

ఇది సబబా!!

ఇలా డా॥ ఘనీ చర్యలపై విరుచుకుపడ్డాడు మరో ఆశ్రమవాసి, బాబా ప్రేమికుడు
డాక్టర్ నీలూ. ఆయన పూర్తిపేరు నీలకాంత్ గాడ్సే.
డా॥ నీలూ ఎన్ని అభ్యంతరాలు చెప్పినా ఘనీ తన మానాన తాను చేపట్టిన
వేలం కార్యక్రమం పూర్తిచేశాడు.
సూటు వేలంలో అత్యధికంగా కోట్ చేసిన విష్ణు మాస్టర్‌కు కోటును ఇచ్చివేశాడు.
సూటు వేలం పూర్తయింది.
ఆ దరిమిలా విష్ణు మాస్టర్ దగ్గర్నుంచి ఆ సూటును డాక్టర్ నీలూ కొనుగోలు చేశాడు.
ఈ విషయం డా. ఘనీ చెవిన పడింది.
ధైర్యం వుంటే నేరుగా వేలంలో కొనుక్కునుంటే బాగుండేది కానీ,
ఈ మాదిరి దొడ్డి దారిన నీలూ ప్రవర్తిస్తాడా అని ఘనీ రుస రుసలాడాడు.
మీదుమిక్కిలి, ఆశ్రమంలో వేలం నిషిద్దం!
ఆశ్రమ నియమాలపై పెద్ద ఉపన్యాసం ఇస్తాడా అని,
సరైన సమయం కోసం వేచి ఉందామని నిశ్చయించుకున్నాడు డా. ఘనీ.
ఇంతలో మెహెర్‌బాబాకు ఘనీ సూటు వేలం వేసిన సంగతి తెలిసింది.
ఆశ్రమ నిబంధనలు ఉల్లంఘించారని బాబా గట్టిగానే కొప్పడ్డారు.
ఐతే ఘనీ వినమ్రంగా ఏం జరిగిందో,
ఏ పరిస్థితుల్లో తాను వేలం ఏర్పాటు చేసిందో బాబాకు వివరించి
అందరి ఎదుట దెప్పిపొడుస్తున్నట్లు, ఆశ్రమ నియమాలు డాక్టర్ నీలూకే బాగా తెలుసు!!
అని చమత్కారంగా నవ్వుతూ అన్నాడు.
అందుకే నీలూ వేలంలో పాల్గొన లేదనీ అన్నాడు.
ఐనప్పటికీ విష్ణు మాస్టర్ దగ్గర్నుంచి దొడ్డిదారిలో సూట్‌ను కొనుగోలు చేసిన ఘనత
డాక్టర్ నీలూకే దక్కుతుందని బాబాతో అన్నాడు.
చిన్నపిల్లల్లా పోట్లాడుకుంటున్న మండలి ప్రేమికుల్ని చూసి బాబా కూడా
కడుపారా నవ్వుకున్నారు.
మెహెర్‌బాబా ఆశ్రమం సాధారణ 'ఆశ్రమం' మాదిరిగా ఎన్నడూ లేదు.
నవ్వుతూ – సరదాగా ఆధ్యాత్మిక వాతావరణంలో అవతారుని సమక్షంలో
మండలి సభ్యులు గడిపారు. బాబా ఆశ్రమం భిన్నమైంది. కూర్చున్నచోట
నుండి కదలకుండా,
మెడ ప్రక్కకు తిప్పకుండా, వెన్ను నిటారుగా వుంచి,
నిరంతరం ధ్యానం చేస్తూ గడపటంలాంటి సంకేతాలు మెహెరాశ్రమంలో
మచ్చుకైనా కనపడేవి కావు.
అంతా సరదా సరదాగా బాబా సమక్షంలో కాలం గడిపేవారు.

# అంతీంద్రియ శక్తులు కావాలి!!

ఆ సమయంలో బాబా రాహూరి ఆశ్రమంలో ఉన్నారు.
బాబాతోపాటు డా. ఘనీ తదితర మండలి సభ్యులందరూ ఉన్నారు.
ఒకరోజున హాస్యంగా, నవ్వుతూ బాబా –
నీతో ఎంతో కాలంగా మీ ఆశ్రమంలో ఉంటున్నాను.
అందువల్ల నాకేమీ లాభం చేకూరలేదు.
ఒక్క చిన్న మంత్రశక్తి కూడా నాకబ్బలేదు.
నీతో ఇంతకాలం ఉండి ఏం లాభం అని బాబా చిన్ననాటి మిత్రుడు, ప్రేమికుడైన ఘనీ బాబాతో అన్నాడు.
ఏవైనా కొన్ని శక్తులు నాకిప్పిస్తే –
వాటితో నా జీవన భుక్తికి లోటు రాదు –
అలాగే స్థానిక ప్రజల్లో ఎంతో కొంత గౌరవం నాకూ ఉంటుందని అన్నాడు.
ఓ.కే. నీకు అలాంటి శక్తులు కొన్ని తప్పక ఇస్తాను.
ఐతే నేను చెప్పినట్లు – ఈ క్రింది మూడింటిలో ఏదో ఒకటి నీవు తు.చ. తప్పక నడుచుకోవాలన్నారు.
అవేమంటే –

1. ఒంటినిండా వీభూతి రాసుకుని, ఏదేని శ్మశానంలో నగ్నంగా కూర్చోవాలి.
2. ఆరు నెలలపాటు కేవలం మంచినీటిని మాత్రమే త్రాగి బ్రతకాలి.
3. లేదా ఆకలి వేసినప్పుడు కేవలం పాలు త్రాగి కనీసం మూడు నెలలపాటు వుండాలి.

ఈ మూడింటిలో, మూడవ నియమాన్ని తాను పాటిస్తానని బాబాతో ఘనీ వాగ్దానం చేశాడు. మొదటి నియమాన్ని పాటించావంటే, నేల మీదున్న చిటికెడు మట్టిని తీసుకుని నీవెవరికిచ్చినా వారి కోర్కెలన్నీ సమసిపోతాయి, ఆనందంగా ఉండగల్గుతారన్నారు బాబా.
ఐతే ఘనీ ఈ నియమాన్ని పాటించలేనని చెప్పి, పాలు త్రాగి మూడు నెలలు బ్రతుకుతానని అంగీకరించాడు. ఇదంతా కాకతాళీయపు చర్చగా మొదలయినా, చిలికి చిలికి గాలివానలాగా, చివరాఖరకి ఒక ఛాలెంజ్‌గా నిల్చింది.
ఘనీకి పాలంటేనే గిట్టదు. ఐనాసరే ఆకలేసినప్పుడల్లా పాలు త్రాగుతూ బాబా ఇచ్చిన నియమావళిని పాటించాడు. ఘనీ శరీరం కూడా పాల వాసన వస్తోందని బాబా చమత్కరించారు. క్రమేణా ఘనీ ఆరోగ్యం క్షీణించింది. ముఖం కళావిహీనమయింది.
ఏమైనా సరే ఘనీ తాను చేపట్టిన వ్రతం పూర్తి చేయ్యాలని గట్టి పంతంగా ఉన్నాడు.

మూడు నెలల కాలపరిమితి పూర్తికాబోతుండగా – ఘనీ త్వరలో ప్రాణాలు వదిలేస్తాడన్నారు బాబా.

అంతిమయాత్ర ఏర్పాట్లన్నీ చేపట్టమని మండలి వారిని బాబా ఆదేశించారు. రాహూరీ ఆశ్రమ సమీపంలోనే ఘనీని సమాధి చేయడానికి వీలుగా గొయ్యి త్రవ్వించారు. శవపేటిక తెప్పించారు. శవపేటికను పూలతో అలంకరిచారు. దుఃఖంతో మండలివారందరూ శవపేటిక చుట్టూతా నిల్చునుండగా, బాబా ఆ శవపేటికలో అడుగుపెట్టి కొద్దిసేపు వుండి బయటకు వచ్చారు. అనంతరం మండలివారి నందరినీ శవపేటిక చుట్టూతా ప్రదక్షణ చేసి, ముందుగా త్రవ్వి వుంచిన గోతిలో శవపేటికను వుంచమన్నారు. అంతా మెహెర్‌బాబా ఆదేశాల మేరకు మండలివారు జరిపారు.

ఆ తర్వాత ఘనీ చేపట్టిన దీక్షను విరమించమని బాబా ఆదేశించారు.

ఈ విషయమై డా. ఘనీ ప్రస్తావిస్తూ – ఈ చర్యల ద్వారా నా జీవితంలో బాబా ఏదో గొప్ప మార్పు తీసుకొచ్చారు. అవతారుని లీలలు సామాన్య మానవులమైన మనకు అర్థంకావు కదా!! అన్నారు.

# ధ్యానం

1930 ప్రాంతంలో మెహెర్‌బాబాతో పాటు డా. ఘనీ కూడా ఇంగ్లాండు, అమెరికా దేశయాత్రలకు వెళ్ళాడు. పాశ్చాత్య బాబా ప్రేమికుడు మెరిడిత్‌స్టార్ ఇంగ్లాండులో మెహెర్‌బాబా బృందానికి 1931, 1932 లలో ఇంగ్లాండు పర్యటనలో ఆతిధ్యం ఇచ్చాడు.

మెరిడిత్ స్టార్ ఎదుట డా. ఘనీ తన పాండిత్యాన్నంతా ప్రదర్శిస్తూ **ధ్యానం – ఆవశ్యకత** – పై విశేష ప్రసంగం చేసి పాశ్చత్యులందర్నీ ఆకట్టుకున్నాడు. దాంతో మెరిడిత్ స్టార్ బాబా మండలి సభ్యులను తమతో ధ్యానంలో కూర్చునేలా ఆదేశించామని కోరాడు. అందుకు బాబా అంగీకరించారు. ఐతే, బాబా మండలివారికి ధ్యానం లాంటి విషయాలకు ప్రాధాన్యత లేదు. ఐనప్పటికీ ఘనీ చేసిన ప్రసంగం వల్ల ఈ కష్టం వచ్చిపడిందని అందరూ ఘనీపై కోపడ్డారు. ఇంగ్లాండులో ఎముకలు కొరికే చలిలో ధ్యానముద్రలో ఉండటం మండలివారికి అసాధ్యమయింది. ఈ విషయాన్నే వారు డా. ఘనీ ద్వారా బాబాకు విన్నవించుకున్నారు.

డా. ఘనీ వల్లనే ఇదంతా జరిగిందని మండలి బాబాతో మొరపెట్టుకుంది.

దాంతో బాబా మెరిడిత్ స్టార్‌ను పిలిపించి, మండలివారు ఇంగ్లాండులోని చలిలో ధ్యానం చేయలేరు. వారివారి గదుల్లో ఆ పనేదో నిర్వహిస్తారని చెప్పి, చలిలో ధ్యానం చేసే పని నుండి బాబా మండలిని కాపాడారు.

ఇదంతా ఘనీ ధ్యాన ప్రసంగం వల్లనే జరిగిందని పలువురు మండలి ఆయనపై రుసరుసలాడారు.

## క్రొత్త పుస్తకాలు- సమీక్ష

# మెహెర్ ప్రవచనావళి







నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు ఆధ్యాత్మిక దృక్పధాన్ని ప్రసాదించగల గ్రంధాలు
మెహెర్ ప్రవచనావళి,(DICOURSES BY MEHER BABA),
మానవాళికి సందేశము (LISTEN HUMANITY BY MEHER BABA)
మెహెర్ ప్రవచనావళిని శ్రీ మెహెర్ మూర్తి, విశాఖపట్నం,
మానవాళికి సందేశము అనే గ్రంధాన్ని శ్రీ కంకిపాటి నారాయణ రావు,
ఆయా ఆంగ్ల మూల గ్రంధాల నుండి అనువదించి ఇటీవల లాంఛనంగా మెహెర్ ప్రేమిక లోకానికి విడుదల చేశారు.

1938 నవంబరు నుండి 1942 అక్టోబరు వరకూ సుమారు 4 సంవత్సరాలు మెహెర్‌బాబా మాస పత్రికను నిర్వహించారు. ఆ దరిమిలా రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో న్యూస్ ప్రింట్ కొరత కారణంగా మెహెర్‌బాబా పత్రికను నిలిపివేశారు. ఐతే, పత్రిక కొనసాగిన నాలుగు సంవత్సరాలలో ప్రతి నెలా ప్రతి సంచికకు మెహెర్‌బాబా ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని ఇచ్చారు. అలా మెహెర్‌బాబా 42 అంశాలపై ఇచ్చిన 72 ప్రవచనాలను DICOURSES BY MEHER BABA పేరిట గ్రంధస్తం చేశారు. అనంతరం మన తెలుగు పెద్దలు పలువురు 1950వ దశకం మొదలు

ఈ గ్రంధాన్ని తెలుగులో అనువదించారు. మునుముందుగా శ్రీ బులుసు వెంకటేశ్వర్లు గారు, శ్రీ నూతికట్టు కోటయ్య గారు, శ్రీ చాగంటి సుబ్బారావు గారు ఇలా మెహెర్‌బాబా డిస్కోర్సెస్ గ్రంధాన్ని ఆసాంతం చదివి తెలుగు వారికోసం ప్రత్యేకంగా ఎంతో శ్రద్దతో అనువదించి ఎంతో ఉపకారం చేశారు. ఇంతమంది అనువాదం చేసిన గ్రంధాన్నే తిరిగి మరలా మరో ప్రయత్నంగా శ్రీ మెహెర్ మూర్తి, విశాఖపట్నం వారు చేపట్టడం ఓ విశేషం. రచనా విధానంలో ఎవరి శైలి వారిది కదా! " ఇంతక్రితం వరకూ **మెహెర్ ప్రవచనాలు** పేరుతో అనువాదం జరిగింది. నేను **మెహెర్ ప్రవచనావళిగా** గ్రంధానికి పేరు పెట్టానని శ్రీ మూర్తి పుస్తకంలో ముందుమాటలో పేర్కొన్నారు. అలాగే అనువాద రచనా శైలిలో తన విధానం భిన్నంగా వుంటుంది గాన తానీ అనువాద ప్రక్రియకు తిరిగి పూనుకున్నట్లు అయన పేర్కొన్నారు.

మెహెర్‌బాబా సాహిత్యం ఆధ్యాత్మిక పథంలోని వారికి బ్రహ్మ సూత్రాల వంటివని జిజ్ఞాసువులు పేర్కొంటారు. ప్రత్యేకించి మెహెర్‌బాబా ప్రవచనములు గ్రంధాన్ని ఈ తరం యువత తప్పక చదవాలి. మెహెర్‌బాబా ప్రవచనాలను ఆసాంతం ఔపోసన పట్టినవారు తెలుగువారిలో చాలాకొద్దిమంది మాత్రమే వున్నారు. వారిలో కొందరే గ్రంధ రచనకు పూనుకున్నారు. ఇప్పటిదాకా ఈ గ్రంధాలను క్షుణ్ణంగా చదివిన పెద్దలు ఆయా బాబా సెంటర్‌లలో వారం వారం నిర్వహించే సత్సంగ్‌లలో కాకుండా ప్రత్యేక పుస్తక పఠన కార్యక్రమాలు ఏర్పాటుచేసుకుని ఆ కార్యక్రమాలకు యువతరాన్ని ఆహ్వానించి వారిని ప్రోత్సహించడం తక్షణావసరం.

ఈ పుస్తకాలు – **మెహెర్ ప్రవచనావళి, మానవాళికి సందేశము** ప్రతి ఇంటా వుండవల్సినవి. ప్రతివారూ తప్పక చదివి తీరాలి. ఐతే, అనువాద రచన మరికొంత వ్యావహారిక భాషలో వుండివుంటే యువతకెంతో లాభం చేకూరేది. **ప్రాప్తిస్థానం – శ్రీ టి.ఎ. క్రిష్ణ, మెహెర్ నగర్, తాపేశ్వరం – 533 340, తూర్పు గోదావరి జిల్లా, ఫోన్–08855-230581**

# వర్ణి బాబా సెంటర్ 10వ వార్షికోత్సవం

నిజామాబాద్ జిల్లాలోగల వర్ణి బాబా సెంటర్ 10వ వార్షికోత్సవాన్ని 09.06.2013 ఆదివారం ఘనంగా జరుపుకున్నట్లు మా ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీ మలకపల్లి మల్లిఖార్జునరావు – ఎడిటర్, బిలవడ్ బాబా జర్నల్, హైదరాబాద్ ధుని ప్రజ్వలన చేసి బాబా కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, ఈ కార్యక్రమంలో శ్రీ పి.ఎస్.కె. శర్మ బాబావారి సప్తవర్ణ పతాకావిష్కరణ చేయగా, బాబా సందేశాలపై శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ పి.పి. హరి, లక్ష్మీనారాయణ (సిరిసిల్ల), శ్రీమతి శివ నాగేశ్వరి, శ్రీ పిడుగు అప్పారావు తదితరులు ప్రసంగించారు.

సహవాస్ కార్యక్రమాన్ని శ్రీ ఎ. జనార్ధనరావు (నిజామాబాద్) సమర్ధవంతంగా నిర్వహించారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

## మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

2013 మే - జూన్ నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జూన్ | వై. జయశ్రీ, ఖమ్మం | రూ. 500.00 |
| 2. | జూన్ | యం. అశ్వర్ధనారాయణ, అనంతపురం | రూ. 500.00 |
| 3. | జూన్ | సి.వి. నాగేశ్వరరావు, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 4. | జూన్ | ఎల్. బాలక్రిష్ణారావు, పార్వతీపురం, విజయనగరం | రూ. 500.00 |
| 5. | జూన్ | టి. గోవర్ధన్, నిజామాబాద్ | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ. 3,000.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).

2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.

3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.

4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.

5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087. ఫోన్:99595-53218, email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**